సీమను గ్రీన్ ఎనర్జీ హబ్‌గా చేస్తాం

- ప్రాజెక్టులు పూర్తి చేస్తాం - కర్నూలులో హైకోర్టు బెంచ్‌కు ప్రతిపాదనలు
- జిల్లా పర్యటనలో ముఖ్యమంత్రి చంద్రబాబు

ప్రజాశక్తి - కర్నూలు ప్రతినిధి/పత్తికొండ

రాయలసీమను గ్రీన్ ఎనర్జీ హబ్‌గా చేస్తామని, 7.50 లక్షల మందికి ఉద్యోగాలు ఇస్తామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు హామీ ఇచ్చారు. పత్తికొండ మండలం పుచ్చకాయలమాడలో మంగళవారం ముఖ్యమంత్రి పర్యటించారు. విమానంలో ఓర్వకల్లు విమానాశ్రయానికి చేరుకున్న ఆయన అక్కడి నుంచి హెలికాప్టర్‌లో పుచ్చకాయలమాడకు చేరుకున్నారు. తలారి గంగమ్మ, వెంకటేష్ ఇళ్లకు వెళ్లి వారికి పింఛను అందజేశారు. గ్రామంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేశారు. కాశీ విశ్వేశ్వర దేవాలయంలో పూజలు నిర్వహించారు. అనంతరం నిర్వహించిన ప్రజావేదిక సభలో ముఖ్యమంత్రి మాట్లాడారు. ఊరికి దగ్గరగా నది, వాగు ఉంటే నేరుగా వెళ్లి ఇసుక తెచ్చుకోండని, కానీ ఒక పద్ధతి ప్రకారం తవ్వుకోవాలని గ్రామస్తులకు సూచించారు. హంద్రీనీవా నుంచి నీళ్లు తీసుకుని బిందు సేద్యం ద్వారా పొలాలకు నీరు ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. పోలవరం పూర్తి చేసి పెన్నాకు అనుసంధానం చేయగలిగితే రాయలసీమ సస్యశ్యామలం అవుతుందన్నారు. గుండ్రేవుల, ఆర్‌డిఎస్, గురు రాఘవేంద్ర పూర్తి చేసేందుకు ముందుకు వెళ్తామని తెలిపారు. ఓర్వకల్లుకు పరిశ్రమలు తెస్తామని, కర్నూలు–బళ్లారి రహదారిని జాతీయ రహదారి చేస్తామని హామీ ఇచ్చారు. కర్నూలులో హైకోర్టు బెంచ్‌కు ప్రతిపాదనలు పంపుతామన్నారు. పుచ్చకాయలమాడ గ్రామ అభివృద్ధికి కృషి చేస్తామని తెలిపారు. గ్రామంలో ఇల్లు లేని 103 మందికి గృహాలు నిర్మించి ఇస్తామన్నారు. 15 మందికి రేషన్ కార్డులు లేవని, వారికి కార్డులు ఇస్తామని తెలిపారు. 230 మందికి నీటి కుళాయిలు ఇస్తామని, 105 మందికి మురుగుదొడ్లు, ఒకరికి విద్యుత్ కనెక్షన్ కావాలన్నారని, వారికి వెంటనే మంజూరు చేస్తున్నామని హామీఇచ్చారు. రాష్ట్రంలో అన్ని గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. అనంతరం పరిశ్రమల శాఖ మంత్రి టిజి.భరత్ మాట్లాడారు. పత్తికొండ సమీపంలో ఏర్పాటు చేస్తున్న టమోటా ప్రాసెసింగ్ యూనిట్‌ను ఆరు నెలల్లో పూర్తి చేస్తామని తెలిపారు. కష్టాలు ఉన్నా ఇచ్చిన మాట ప్రకారం పింఛన్ల పెంపు చాలా గొప్ప విషయమని చెప్పారు. అన్న క్యాంటీన్లు పెట్టడం కూడా గొప్ప అంశమని చెప్పారు.

సాగునీరు అందించాలి : ఎంపీ

ఎంపీ బస్తిపాటి నాగరాజు మాట్లాడుతూ... వేదవతి, గుండ్రేవుల, ఆర్‌డిఎస్ కాలువ పూర్తి చేసి సాగునీరు అందించాలని కోరారు. కర్నూలు నుంచి బళ్లారి నేషనల్ హైవే మార్గం ఏర్పాటు చేయాలని తెలిపారు. సంక్షేమ హాస్టళ్లను రెట్టింపు చేయాలని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకొచ్చారు.

ప్రజలనుద్దేశించి మాట్లాడుతున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు

పలు సమస్యలను విన్నవించిన ఎమ్మెల్యే

పత్తికొండ ఎమ్మెల్యే కెఇ.శ్యామ్ కుమార్ మాట్లాడుతూ... హంద్రీనీవా మీద నాలుగు లిఫ్టులు ఉన్నాయని, వాటికి స్లూయిజ్ గేట్లు ఏర్పాటు చేయాలని కోరారు. హంద్రీనీవా ద్వారా 68 చెరువులకు నీళ్లు నింపాలని గతంలో టిడిపి ప్రభుత్వ హయాంలో 70 శాతం పనులు పూర్తి చేశామని తెలిపారు. ఐదేళ్ల కాలంలో వైసిపి ప్రభుత్వం అరకొర పనులు చేసి చెరువులకు నీళ్లు నింపే కార్యక్రమం ప్రారంభించిందని చెప్పారు. వైసిపి హయాంలో పత్తికొండలో గంజాయి, మద్యం విచ్చలవిడిగా దొరకడంతో యువత చెడు అలవాట్లకు బానిసలు అయ్యారని, ఎస్పీ ప్రత్యేక చొరవతో ప్రత్యేక నిఘా పెట్టామని అన్నారు. పత్తికొండలో పాలిటెక్నిక్ కళాశాల ఏర్పాటు చేయాలని, క్రిష్ణగిరి, వెల్దుర్తి మండలాల్లో డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలని, అందుకు తాము ఐదు ఎకరాల భూమి విరాళంగా ఇస్తామని తెలిపారు. మాజీ ఉప ముఖ్యమంత్రి కెఇ.కృష్ణమూర్తి, మాజీ మంత్రులు కెఇ.ప్రభాకర్, గుమ్మనూరు జయరామ్, కలెక్టర్ పి.రంజిత్ బాషా, డిఐజి కోయ ప్రవీణ్, ఎస్పీ జి.బిందు మాధవ్, టిడిపి జిల్లా అధ్యక్షులు పాలకుర్తి తిక్కారెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు సాంబశివారెడ్డి, సర్పంచి హారిక, ఎంపిటిసి చంద్ర పాల్గొన్నారు.

మాట్లాడుతున్న మంత్రి టిజి.భరత్

హమాలీల కూలి రేటు పెంపు ఎక్కడ

- కొత్త ఒప్పందం చేసుకోని పౌరసరఫరాల సంస్థ
- క్వింటా రూ.40 పెంపుకు డిమాండ్
- దసరా బోనస్ అందజేతపై స్పష్టత కరువు

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

సివిల్ సప్లయ్ కార్పొరేషన్ గోడౌన్లలో పనిచేసే హమాలీల కూలిరేటు పెంపుకు పౌరసరఫరాల కార్పొరేషన్ సంస్థ చర్యలు తీసుకోవడం లేదు. గత ఏడాది డిసెంబర్ నాటికి హమాలీల కూలీలకు సంబంధించిన ఒప్పందం గడువు ముగిసింది. కొత్త ఒప్పందం మాత్రం ఇప్పటివరకు అమలుకు దృష్టి సారించడం లేదు .జిల్లాలో సివిల్ సప్లయ్ కార్పొరేషన్ సంస్థకు సంబంధించిన ఏడు ఎంఎల్ఎస్ పాయింట్ గోడౌన్లు ఉన్నాయి. ఈ గోడౌన్లలో దాదాపుగా 500 మందికి పైగా హమాలీలు పనిచేస్తున్నారు. ప్రతినెల ప్రభుత్వం పంపిణీ చేసే రేషన్ బియ్యంతో పాటు చక్కెర కందిపప్పు వంటి వాటిని లోడింగ్ చేసేందుకు క్వింటా కింద రూ.25 లు చెల్లిస్తుంది. ప్రస్తుతం పెరిగిన ధరలకు అనుగుణంగా కూలిరేట్లను సివిల్ సప్లయ్ కార్పొరేషన్ సంస్థ చెల్లిస్తున్న మొత్తం సరిపోవడం లేదు. గత ఏడాది డిసెంబర్ నాటికి హమాలీల ఒప్పంద గడువు ముగిశాక కొత్త ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కూడా పట్టించుకోలేదు. హమాలీలు కష్టపడి పని చేసిన పనికి కూడా తగిన కూలి కూడా అందకపోవడం పట్ల ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుత పెరిగిన నిత్యవసర ధరలకు అనుగుణంగా కూలీరేట్లను పెంచాలని హమాలీలు సివిల్ సప్లయ్ కార్పొరేషన్ సంస్థ అధికారులకు అనేకసార్లు విన్నవించుకున్నారు. హమాలీలకు ప్రతి ఏడాది దసరా కింద ఇచ్చే బోనస్‌తో పాటు 3 జతల బట్టలు స్వీట్ బాక్సులు అందజేతపై ఇప్పటి వరకు సంస్థ ఉన్నతాధికారులు ఎలాంటి స్పష్టత ఇవ్వ లేదు.

మంత్రికి వినతిపత్రం అందజేస్తున్న ప్రతినిధి బృందం

హమాలీల కూలి రేట్లు పెంచాలి
- మంత్రి టిజి.భరత్‌కు వినతి

సివిల్ సప్లయ్ కార్పొరేషన్ గోడౌన్లలో పనిచేసేహమాలీల కూలి రేట్లు పెంచేందుకు చర్యలు తీసుకోవాలని ఎపి సివిల్ సప్లయ్ హమాలి యూనియన్ ఆధ్వర్యంలో రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టిజి.భరత్‌కు యూనియన్ ప్రతినిధిబృందం మంగళవారం కలిసి వినతిపత్రం సమర్పించారు. రాష్ట్ర అధ్యక్షులు ఆర్.కృష్ణ, జిల్లా కార్యదర్శి బజారి, నాయకులు సోలమన్ రాజు, చంద్ర లు పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ పెరిగిన నిత్యవసర ధరలకు అనుగుణంగా ప్రస్తుతం అమలు చేస్తున్న కూలి రేట్ల ఒప్పందం గత ఏడాది డిసెంబర్ నాటికే ముగిసిందని తెలిపారు. క్వింటా రు.25నుంచి రూ.40 కి పెంచాలన్నారు. హమాలీలందరికీ దసరా బోనస్ కూడా ఇవ్వాలని కోరారు.

కొత్త ఒప్పందం వెంటనే చేసుకోవాలి
- ఆర్.కృష్ణ, రాష్ట్ర అధ్యక్షులు, సివిల్ సప్లయ్ హమాలీ యూనియన్

హమాలీల కూలిరేట్లను ప్రస్తుతం చెల్లిస్తున్న క్వింటా రూ.25 నుండి రూ.40 పెంచాలి. వెంటనే కొత్త ఒప్పందం కూడా చేసుకోవాలి. దసరా బోనస్ కూడా వెంటనే కార్మికులకు అందజేయాలి. హమాలీల సంక్షేమానికి తగు చర్యలు తీసుకోవాలి.

హమాలీల కూలిరేట్లను వెంటనే పెంచాలి
- బజారి, జిల్లా కార్యదర్శి, సివిల్ సప్లయ్ హమాలీ యూనియన్

హమాలీల కూలిరేట్లను వెంటనే పెంచాలి. ప్రస్తుత నిత్యవసర ధరలకు పెరిగిన దానికి అనుగుణంగా తమ కూలిరేట్లను పెంచితే హమాలీలకు ఎలాంటి ఇబ్బందులు ఉండవు. వెంటనే కొత్త ఒప్పందం చేసి తగు చర్యలు తీసుకోవాలి

దసరా బోనస్ రూ 15000 ఇవ్వాలి
- సోలమన్ రాజు, కార్యదర్శి, కర్నూలు ఎంఎల్ఎస్ పాయింట్

ప్రస్తుతం హమాలీలకు చెల్లిస్తున్న దసరా బోనస్ రూ.6000 నుండి రూ.15000 ఇవ్వాలి. మూడు జతల బట్టలు అందజేతతో పాటు స్టిచ్చింగ్ చార్జీలను కూడా రూ.3 వేలకుకు పెంచాలి. వెంటనే దసరా బోనస్ మూడు జతల బట్టలు స్వీట్ బాక్సులు ఇవ్వాలి.

'విశాఖ ఉక్కు' ప్రయివేటీకరణను

ఉపసంహరించుకోవాలి

- విద్యార్థి, యువజన సంఘాల ఆధ్వర్యంలో దీక్షలు
- ప్రజాసంఘాల, కార్మిక, మహిళ సంఘాల మద్దతు

ప్రజాశక్తి - కర్నూలు అగ్రికల్చర్

32 మంది విద్యార్థుల త్యాగాలు, వందలాది మంది వామపక్ష ఎమ్మెల్యేల రాజీనామాలతో, వేలాదిమంది రైతుల త్యాగాలతో నిర్మించుకున్న విశాఖ ఉక్కు ఫ్యాక్టరీ ప్రయివేటీకరణ ఆలోచనను ఉపసంహరించుకోవాలని నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం విశాఖ ఉక్కు ప్రయివేటీకరణను వ్యతిరేకిస్తూ, విశాఖ ఉక్కు ఫ్యాక్టరీకి సొంత గనులు కేటాయించాలని సైల్ (స్టీల్ అథారిటీ ఆఫ్ ఇండియా)లో కలపాలని కోరుతూ విద్యార్థి, యువజన సంఘాల ఆధ్వర్యంలో నగరంలోనిధర్నా చౌక్‌లో రిలే దీక్షలు చేపట్టారు. ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి అబ్దుల్లా, సాబీర్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా అధ్యక్షులు పిఎస్.రాధాకృష్ణ, ఎఐవైఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లెనిన్ బాబు, డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నగేష్, భాస్కర్ మాట్లాడారు. ఒకవైపు ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ప్రయివేటీకరణను వ్యతిరేకిస్తామని చెబుతూనే స్వరంలో మార్పు చేసి నష్టాలు వస్తే ఎన్ని రోజులని భరిస్తారని మాట మార్చడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. విశాఖ ఉక్కు ఫ్యాక్టరీని సైల్‌లో కలుపుతామని ప్రకటన చేస్తూనే రాత్రికి రాత్రి 4 వేల మంది కాంట్రాక్ట్ ఉద్యోగులను తొలగించడం దేనికి సంకేతమని నిలదీశారు. వెంటనే విశాఖ ఉక్కు ఫ్యాక్టరీకి సొంత గనులు కేటాయించి, శాఖ ఉక్కు ఫ్యాక్టరీని ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాలని డిమాండ్ చేశారు. లేకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. రాష్ట్రంలో, కేంద్రంలో అధికారంలో ఉన్న ఎన్‌డిఎ కూటమి ప్రభుత్వం విశాఖ ఉక్కు ప్రయివేటీకరణ చేస్తే ప్రజాగ్రహానికి గురి కావాల్సి వస్తుందని హెచ్చరించారు. అనంతరం సిఐటియు, ఎఐటియుసి జిల్లా కార్యదర్శులు అంజిబాబు, మునెప్ప, పిడిఎస్‌యు నాయకులు తిరుమలేష్, ఎఐవైఎఫ్ నాయకులు శ్రీనివాసులు, చంద్రశేఖర్, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు రంగప్ప, డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు రాఘవేంద్ర మాట్లాడారు. ఎస్ఎఫ్ఐ నగర్ అధ్యక్ష, కార్యదర్శులు అమర్ సాయి, ఉదయ్, కర్నూలు మండల కార్యదర్శి అంజి, డివైఎఫ్ఐ నగర కార్యదర్శి హుస్సేన్ బాషా, నాయకులు వీరేష్, రాము, ఎఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు సోమన్న, నాయకులు శరత్, ఎస్ఎఫ్ఐ రాయలసీమ యూనివర్సిటీ కార్యదర్శి రామకృష్ణ పాల్గొన్నారు.



దీక్షలనుద్దేశించి మాట్లాడుతున్న రాధాకృష్ణ

మానవత్వంచాటుకున్న గోపాల్

- ఇంకొకరికి చూపు ప్రసాదించిన అభినందనీయుడు
- సిపిఎం జిల్లా కార్యదర్శి గౌస్ దేశాయ్

ప్రజాశక్తి - కర్నూలు కార్పొరేషన్

కళ్లను దానం చేసి మానవత్వాన్ని చాటుకున్న వ్యక్తి ఆటో డ్రైవర్ కె.గోపాల్ అని సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్ దేశాయ్ కొనియాడారు. కర్నూలు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 32వ వార్డు ముజఫర్ నగర్ నివాసి, సిపిఎం పార్టీ సభ్యుడు, ఆటోనే వృత్తిగా చేసుకొని జీవిస్తున్న కె.గోపాల్ సోమవారం గుండెపోటుతో మృతి చెందారు. విషయం తెలుసుకొన్న సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్ దేశాయ్, సిఐటియు జిల్లా కార్యదర్శి ఎమ్‌డి.అంజిబాబు, సిపిఎం నగర కార్యదర్శి టి.రాముడు, ఆటో యూనియన్ (సిఐటియు) జిల్లా ప్రధాన కార్యదర్శి కె.ప్రభాకర్, నగర కార్యదర్శి బి.రాధాకృష్ణ, సిపిఎం నగర కార్యదర్శి వర్గ సభ్యులు సిహెచ్.సాయిబాబా, కె.సుధాకరప్ప, ముజఫర్ నగర్ కార్యదర్శి ఎం.చిన్న ఆనంద్, ఆటో యూనియన్ నగర కార్యదర్శి షంషేర్ బాష, ముజఫర్ నగర్ ఆటో యూనియన్ నాయకులు జేమ్స్, ఐద్వా నాయకులు ధనలక్ష్మి, దానమ్మ, ఓబులమ్మ, లక్ష్మీబాయి తదితరులు మంగళవారం గోపాల్ నివాసంలో ఉంచిన మృతదేహాన్ని సందర్శించి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం అంత్యక్రియల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. పార్టీ అభివృద్ధికి, ఆటో కార్మికుల సంక్షేమం కోసం పోరాటంలో ముందుండేవారని కొనియాడారు. ఆటో కార్మికునిగా ఉంటూనే పార్టీ ఇచ్చే కార్యక్రమాల్లో పాల్గొనే వారని తెలిపారు. సంఘం కోసం కృషి చేసేవారని, పైగా తన కళ్లను ఇతరులకు దానం చేశారని, అవయవ దానం గొప్ప విషయమని, పార్టీ అలాంటి కార్యకర్తను కోల్పోవడం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం చంద్రన్న బీమా పథకాన్ని అమలులోకి తెచ్చి గుండెపోటుతో మరణించిన గోపాల్ కుటుంబానికి రూ.5 లక్షల ఆర్థిక సహాయం అందించాలని కోరారు. ఆటో కార్మిక సంఘం నాయకులు అయ్యస్వామి, శంకర్, మౌలాలి, నాగరాజు, రవి, రంగన్న, జమ్మన్న పాల్గొన్నారు.

నివాళులర్పిస్తున్న నాయకులు

సీఎం చంద్రబాబుకు ఘన స్వాగతం

ప్రజాశక్తి-కర్నూల్ కలెక్టరేట్

రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు మంగళవారం పత్తికొండ పర్యటనలో భాగంగా ఓర్వకల్ విమానాశ్రయానికి ప్రత్యేక విమానంలో చేరుకున్నారు. అక్కడ విమానాశ్రయంలో మంత్రులు బిసి జనార్దన్ రెడ్డి, ఎన్ఎండి ఫరూక్, ఎమ్మెల్యేలు కోట్ల జయ సూర్య ప్రకాశ్ రెడ్డి, గౌరు చరిత రెడ్డి, బొగ్గుల దస్తగిరి, జయ సూర్య, జాయింట్ కలెక్టర్ బి.నవ్య టిడిపి సీనియర్ నాయకులు గౌరువెంకట్ రెడ్డి, డి విష్ణువర్ధన్‌రెడ్డి, కర్నూలు, ఆర్‌డిఒ శేశిరెడ్డి, టిడిపి నంద్యాల జిల్లా అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్, రాష్ట్ర నాయకులు సోమిశెట్టి వెంకటేశ్వర్లు తదితరులు కలిసి స్వాగతం పలికారు. అనంతరం సాయంత్రం నాలుగున్నర గంటలకు చంద్రబాబు జిల్లా పర్యటన ముగించుకొని విజయవాడకు బయలుదేరి వెళ్లారు. ఈ సందర్భంగా పలువురు ప్రజాప్రతితులు తమ నియోజకవర్గాల పరిధిలోని సమస్యలపై సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకువెళ్లారు.



హారిజోన్స్ ఇంటర్నేషనల్ ప్లేస్కూలులో చిన్నారుల నృత్య ప్రదర్శన

'హారిజోన్స్'లో దసరా వారోత్సవాలు

ప్రజాశక్తి-కర్నూలు కల్చరల్

హారిజోన్స్ ఇంటర్‌నేషనల్ ప్లేస్కూలులో చైర్మన్ ప్రదీప్ కుమార్, డైరెక్టర్ పావని ఆధ్వర్యంలో ఘనంగా దసరా వారోత్సవాలు ప్రారంభించారు. చిన్నారులు దుర్గా మాతా , వివిధమైన వేశా ధారణలతో హావభావాలు, నృత్య ప్రదర్శనలు చేస్తూ ఆకట్టుకున్నారు. ముద్దులొలికే మాటలు మాట్లాడి ముచ్చటగా కనిపించడం తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు. మొత్తం ఉత్సవాల్లో చిన్నారుల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.

జాతీయస్థాయి వసతులతో స్టేడియం

సిబిఎస్ఇ క్లస్టర్ -7 ఫుట్‌బాల్ సెమీఫైనల్ పోటీలను ప్రారంభించిన మంత్రి టిజి.భరత్

ప్రజాశక్తి-కర్నూలు జిల్లాపరిషత్ : కర్నూలు నగరంలో జాతీయస్థాయి వసతులతో స్టేడియం నిర్మాణానికి కృషి చేస్తామని రాష్ట్ర పరిశ్రమలు , వాణిజ్య శాఖ మంత్రి టిజి భరత్ హామీ ఇచ్చారు. కర్నూలు లక్ష్మీపురంలోని రిడ్జ్‌పాఠశాలలో జరుగుతున్న ఉమ్మడి తెలుగు రాష్ట్రాల సిబిఎస్ఇ క్లస్టర్–7 ఫుట్‌బాల్ పోటీలు మూడవరోజు పోటాపోటీగా జరిగి క్వార్టర్ ఫైనల్‌కు చేరుకున్నాయి. రవీంద్రవిద్యా సంస్థల వ్యవస్థాపకులు జి.పుల్లయ్య ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ పోటీలు మంగళవారం క్వార్టర్‌ఫైనల్స్‌ను ముఖ్యఅతిథి మంత్రి టిజి భరత్ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ఇంత పెద్ద ఎత్తున నిర్వహిస్తున్న ఈ సిబిఎస్ఇ క్లస్టర్ ఫుట్బాల్ క్రీడా పోటీలను మన కర్నూలు నగరంలోని రిడ్జ్‌స్కూల్ వేదిక కావడం ఎంతో అభినంద నీయమని తెలిపారు. ఫుట్‌బాల్ క్రీడాకారులకు ప్రపంచ ప్రసిద్ధి చెందిన ప్రముఖ క్రీడాకారుడు మెస్సీ రోనాల్డ్ ఎంతో ఆదర్శం అన్నారు. క్రీడల వల్ల దైనందిన జీవితంలో ఆరోగ్యంతో పాటు చక్కటి క్రమశిక్షణ అలబడుతుందన్నారు. కేంద్ర క్రీడల మంత్రితో మాట్లాడి మన కర్నూలు నగరంలో జాతీయస్థాయి వసతులతో కూడిన స్టేడియం నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం తరఫున కృషి చేస్తామన్నారు. విద్యార్థులు చదువుకు, క్రీడలకు సమ ప్రాధాన్యతనిచ్చి బహుముఖ ప్రజ్ఞను చాటాలన్నారు. అనంతరం రవీంద్ర విద్యాసంస్థల చైర్మన్ జివిఎం మోహన్ కుమార్ మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు క్రీడలను, క్రీడాకారులను ఎంతగానో ప్రోత్సహిస్తున్నాయన్నారు. ఒలంపిక్ క్రీడలు భారతదేశంలో నిర్వహించడానికి మన ప్రధానమంత్రి నరేంద్ర మోడీ దఢ సంకల్పంతో ఉన్నారన్నారు. గ్రామీణ ప్రాంతాల నుండి కూడా ఎందరో క్రీడాకారులు ఒలంపిక్ స్థాయి పోటీలలో పాల్గొనే వారు న్నారని క్రీడా మైదానాలను ప్రభుత్వాలు అభివద్ధిచేయా లన్నారు. గొప్ప క్రీడాకారులు కా వాలంటే విద్యార్థి దశనుండే పు నాదులు వేసు కోవాలన్నారు. రిడ్జ్ పాఠ శాల సిఇఒ జి.గోపీనాథ్, టోర్న మెంట్ కార్యదర్శి డీన్ రాజేంద్రన్, ప్రిన్సిపల్ రాజ్ కమల్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న మంత్రి టిజి.భరత్ , వేదికపై జి.పుల్లయ్య, తదితరులు

మద్యం ప్రియుల అడ్డా ఎల్ఐసి పార్క్

భయభ్రాంతులకు గురవుతున్న మహిళలు
పార్కుల నిర్వహణ పట్టని నగర పాలక సంస్థ అధికారులు
రూ.కోట్ల ప్రజాధనం వథా

ప్రజాశక్తి- కర్నూలు కార్పొరేషన్

కర్నూలు నగరంలో ఎల్ఐసి పార్కు పట్ల నగరపాలక సంస్థ అధికారుల నిర్లక్ష్యం వల్ల పిచ్చి మొక్కలు పెరిగి, గంజాయి, మద్యం తాగేవారికి అడ్డాగా మారింది. పార్క్ వైపు వెళ్లేందుకు మహిళలు, పిల్లలు భయభ్రాంతులకు గురవుతున్నారని కాలనీ అసోసియేషన్ ప్రతినిధులు డాక్టర్ కాంతారెడ్డి, బి శ్రీనివాసులు, రిటైర్డ్ బ్యాంక్ మేనేజర్ ఉమా, పట్టణ పౌర సంక్షేమ సంఘం నాయకులు ఇరిగినేని పుల్లారెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. నగరపాలక సంస్థ అధికారులు, పాలకవర్గం పార్కుల నిర్వహణపై తగిన శ్రద్ధ పెట్టనందువల్ల రూ.కోట్ల ఃప్రజాధనం వథా అవుతుందని విమర్శించారు. మంగళవారం పట్టణ పౌర సంక్షేమ సంఘం ప్రతినిధిబృందం మున్సిపల్ కాలనీ, ఎల్ఐసి కాలనీ, సీతారామ్‌నగర్ పార్కులను పరిశీలించింది. నాలుగు వైపులా రోడ్డు..మధ్యలో రూ.కోట్ల విలువైన స్థలాన్ని మున్సిపాలిటీకి స్వాధీనం చేసి దాదాపు 50 ఏళ్లు అవుతున్నా.. సీతారామ నగర్ ఎల్ఐసి పార్కులో కనీసం మొక్కలు నాటి నడక దారి ఏర్పాటు చేయడంలో విఫలమయ్యారు. గతంలో పోలీసులకు ఫిర్యాదు చేసినప్పటికీ ఎల్ఐసి పార్కులో అసాంఘిక కార్యక్రమాలు జరుగుతూనే ఉన్నాయని తెలిపారు. పిచ్చి మొక్కలను తొలగించి, మంచి మొక్కలు నాటి, శిథిలమైన కట్టడాలను మరమ్మతులు చేసి, నడకదారులను ఏర్పాటు చేసి పార్కులను అందంగా తీర్చిదిద్దాలని కోరారు. పార్కుల అభివృద్ధిపై జరిగిన పర్యటనలో కె. శ్రీనివాసులు, ఎం.నాగరాజు, ఎన్.మద్దిలేటి, ఎస్.సర్వేస్ రెడ్డి, ఎస్.రమణ గౌడు, బి. రాజు, టి. కృష్ణ, ఏ. మధు, టి.పురుషోత్తం రెడ్డి, చాంద్ బాషతో పాటు స్థానిక మహిళలు పాల్గొన్నారు.

పార్కును పరిశీలిస్తున్న పిపిఎస్ఎస్ నాయకులు

వెలుగు ఎపిఎంకు బదిలీ సన్మానం

ప్రజాశక్తి- సి బెళగల్ : మండలంలోని వెలుగు ఎపిఎం వెంకటస్వామి కి మంగళవారం బదిలీ అయిన సందర్భంగా సన్మానించారు. ఇందుకు ముఖ్య అతిథులుగా కెనరా బ్యాంకు మేనేజర్ శ్రీనివాసులు, ఎంపిడిఒ రాముడు, ఇఒఆర్‌డి సందీప్ , గ్రామైక్య మండల అధ్యక్షులు భాగ్యలక్ష్మి ఎసి జలీల్ తదితరులు పాల్గొన్నారు. ప్రతి ఉద్యోగికి బదిలీ తప్పనిసరి అని పలువురు పేర్కొన్నారు. మంచిగా ఉద్యోగం చేయడంతో పాటు మంచి సేవలు అందిస్తే ప్రజాధారణ దక్కుతుందని పేర్కొన్నారు.

గుర్రం జాషువాకు ప్రజాసంఘాల ఘననివాళి

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్ : ఉల్చాల గ్రామంలో గుర్రం జాషువా 129వ జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ ఉత్సవాలను ప్రజాసంఘాల ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. ఎపిరైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జి.రామకృష్ణ, ప్రజానాట్యమండలి జిల్లా అధ్యక్షులు బసవరాజు, కార్యదర్శి నాగరాజు, డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు రాఘవేంద్ర, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి అబ్దుల్లా మాట్లాడారు. గుర్రం జాషువా జీవితం మొత్తం పేద, బడుగు బలహీన వర్గాల ప్రజల కోసం అంటరానితనం, మూఢాచారాలు, కుల వివక్షకు వ్యతిరేకంగా తన రచనలు చేశారని తెలిపారు. తన రచనలకు భారత ప్రభుత్వం గౌరవప్రదమైన పద్మభూషణ్ అవార్డు ప్రధానం చేసిందని అన్నారు. నేడు దేశంలో కుల, మత, ప్రాంతీయ తత్వ పరిస్థితులను ఎదుర్కోవడానికి ప్రజలందరూ చైతన్యంతో కదిలి రావాలని విజ్ఞప్తి చేశారు. మతం, కులం పేరుతో రాజీకీయం చేసే పార్టీలకు తగిన బుద్ధి చెప్పా లన్నారు.

భారతదేశం మొత్తం గ్రామాల్లో నివసిస్తుందని ఆనాటి నాయకులు గొప్పగా చెప్పారని నేడు దేశంలో గ్రామాలు అభివృద్ధికి ఆమడ దూరంలో ఉన్నాయని అన్నారు. రైతుల పట్ల ప్రభుత్వం నిరంకుషత్వంగా వ్యవహరిస్తుందని రోజు రోజుకు రైతుల పరిస్థితి అడుగంటి పోతుందని అన్నారు. ప్రజలందరూ వాటిని తిప్పికొట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు పార్వతయ్య, ప్రకాష్ కిషన్,రాము, అంజి ,గ్రామ రైతులు వెంకటయ్య, బడే సాహెబ్ , ఇస్మాయిల్, గ్రామ ప్రజలు మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

అభ్యుదయ గీతాలు ఆలపిస్తున్న రాజు, సుజాత తదితర కళాకారులు

మధ్యాహ్న భోజన కార్మికులపై రాజకీయాలు చేస్తే ఊరుకోం

- సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి నారాయణస్వామి

ప్రజాశక్తి - ఆలూరు

వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో పని చేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులను తొలగించాలని రాజకీయాలు చేస్తే ఊరుకోబోమని సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి కెపి.నారాయణ స్వామి హెచ్చరించారు. మంగళవారం సిఐటియు ఆధ్వర్యంలో ఎంఇఒ-2 చిరంజీవికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మధ్యాహ్న భోజన కార్మికులు వంటలు బాగా చేస్తున్నా టిడిపి నాయకులు 'మా ప్రభుత్వం వచ్చింది. మావాళ్లే ఉండాల'నే నిరంకుశ ధోరణితో పాఠశాలలోని ఛైర్మన్లు కక్షపూరితంగా రాజకీయం చేసి తొలగించే ప్రయత్నాలు చేస్తే సిఐటియుగా అడ్డుకుంటామని తెలిపారు. ఆలూరులోని ఎపి మోడల్ స్కూల్, జడ్‌పి గర్ల్స్ హైస్కూల్ మధ్యాహ్న భోజన కార్మికులను తొలగించడానికి పూనుకోవడం సరైంది కాదని చెప్పారు. దానిని ఎమ్మెల్యే ప్రోత్సహించడం, విద్యార్థుల తల్లిదండ్రుల మధ్య గొడవలు సృష్టించడం తగదన్నారు. కార్మికుల జోలికి వస్తే చూస్తూ ఊరుకోబోమని, దేనికైనా సిద్ధంగా ఉన్నామని హెచ్చరించారు. సిఐటియు నాయకులు షాకీర్, కృష్ణ, ఐద్వా మండల అధ్యక్షులు షేకున్ బీ, డివైఎఫ్ఐ జిల్లా సహ కార్యదర్శి మైనా పాల్గొన్నారు.

హైస్కూల్‌ను సందర్శించిన మాజీ ఎమ్మెల్సీ

- పాఠశాలలో అపరిశుభ్రత, మట్టి కుప్పలపై ఆగ్రహం

- తట్టతో కార్మికునిగా చెత్తను మోసిన ఇక్బాల్

ప్రజాశక్తి - గోనెగండ్ల

ప్రధానోపాధ్యాయులుతో మాట్లాడుతున్న ఇక్బాల్

గోనెగండ్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను మాజీ ఎమ్మెల్సీ, రాయలసీమ రేంజ్ రిటైర్డ్ ఐజి మహ్మద్ ఇక్బాల్ మంగళవారం సందర్శించారు. గతంలో ఐజిగా ఉన్న సమయంలో పాఠశాలను సందర్శించిన ఆయన పాఠశాల ముందు మురుగును చూసి స్పందించి డ్రెయినేజీ ఏర్పాటుకు కృషి చేశారు. తిరిగి ఇప్పుడు పాఠశాలను సందర్శించిన ఆయన పాఠశాలలో అపరిశుభ్రంగా చెత్త పేరుకొని దుర్వాసనగా ఉండడంతోపాటు నాడు-నేడు పనులు చేపట్టిన తర్వాత మిగిలిన వ్యర్థాలను మట్టిని మధ్యలో కుప్పగా వదిలి వేయడంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే రంగంలోకి దిగిన ఆయన పారిశుధ్య కార్మికులతో కలిసి పార, తట్ట చేతబట్టి చెత్తను తట్టలో మోస్తూ ట్రాక్టర్‌లో వేశారు. నాలుగు ట్రాక్టర్ల దుర్వాసనతో కూడిన చెత్తాచెదారం పూర్తిగా తొలగించేంత వరకు ఆయన విశ్రమించలేదు. ప్రధానోపాధ్యాయులు నాగభూషణం, పంచాయతీ కార్యదర్శి సతీష్, పాఠశాల కమిటీ మాజీ ఛైర్మన్ ఉస్మాన్, పంచాయతీ సిబ్బంది మలాంగ్, అనిల్ పాల్గొన్నారు.

'పొలం పిలుస్తోంది'ని సద్వినియోగం చేసుకోండి : ఎఒ

ప్రజాశక్తి - మంత్రాలయం

పాడి పంటల అభివృద్ధి కోసం ప్రభుత్వం చేపట్టిన 'పొలం పిలుస్తోంది'ని చేపడుతోందని, రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఎఒ జీరా గణేష్, పశు వైద్యాధికారి డాక్టర్ అశోక్ కుమార్, ఉద్యాన అధికారి అపర్ణ తెలిపారు. మంగళవారం మండలంలోని సూగూరు, బూదూరు గ్రామాల్లో 'పొలం పిలుస్తోంది' నిర్వహించారు. పంటల దిగుబడికి, పాడి పశువుల పోషణకు, ఉద్యాన పంటల సాగు గురించి రైతులకు వివరించారు.

హాస్టల్ భవనానికి మరమ్మతులు చేపట్టాలి

- ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు శ్రీనివాసులు

ప్రజాశక్తి - ఆదోని

వినతిపత్రం ఇస్తున్న నాయకులు

ఆస్పరి రోడ్డులో ఉన్న బీసీ ప్రీమెట్రిక్ బాయ్స్ హాస్టల్ భవనానికి వెంటనే మరమ్మతులు చేపట్టాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు శ్రీనివాసులు డిమాండ్ చేశారు. మంగళవారం కార్యాలయంలో అసిస్టెంట్ బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ రాజా కుళ్లాయప్ప యాదవ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. దశాబ్ద కాలం క్రితం నిర్మించిన భవనం శిథిలావస్థకు చేరుకుందన్నారు. భవనం పైకప్పు పెచ్చులూడి కిందపడుతుండడంతో ఎప్పుడెలాంటి ప్రమాదం జరుగుతుందోనని విద్యార్థులు భయాందోళనకు గురవుతున్నారని తెలిపారు. భవనాన్ని పలుసార్లు సందర్శించి అక్కడ దుస్థితిని అధికారుల దృష్టికి తీసుకెళ్లామని చెప్పారు. స్పందించిన అధికారులు హాస్టల్ భవనం పనుల కోసం రూ.12 లక్షలు మంజూరు చేశారని తెలిపారు. నిర్లక్ష్యం చేయకుండా వెంటనే పనులు చేపట్టాలని డిమాండ్ చేశారు. లేకపోతే విద్యార్థులు కలుపుకొని పెద్ద ఎత్తున ఆందోళన నిర్వహిస్తామని హెచ్చరించారు. ఎస్ఎఫ్ఐ పట్టణ అధ్యక్షులు సూరి, నాయకులు శశిధర్, దేవరాజు, లోకేష్, భరత్ కుమార్, పవన్ ఉన్నారు.

మద్యం దుకాణాలు బంద్

- న్యాయం చేయాలని ఉద్యోగుల నిరసన

ప్రజాశక్తి - ఆదోని

ఉద్యోగ భద్రత కల్పించాలని మద్యం దుకాణ ఉద్యోగులు నిరసనకు దిగారు. విద్యావంతులైన తమను అర్హత మేరకు నియామకాలు జరిగాయని, ఎలాంటి రాజకీయ ప్రోద్బలం లేదని, తమకు ప్రభుత్వం న్యాయం చేయాలని జిల్లావ్యాప్తంగా ప్రభుత్వ మద్యం దుకాణాల్లో పనిచేసే ఉద్యోగులు ఆందోళన బాట పట్టారు.

గత వైసిపి ప్రభుత్వంలో జిల్లావ్యాప్తంగా 94 మద్యం దుకాణాలు ఏర్పాటు చేశారు. ఒక్కో దుకాణంలో సూపర్‌వైజర్, ముగ్గురు సేల్స్‌మేన్, ఒక వాచ్‌మేన్‌ను థర్డ్ పార్టీ ద్వారా నియామకాలు చేపట్టారు. ఉద్యోగం పొందిన సూపర్‌వైజర్లకు నెలకు రూ.21,500, సేల్స్ మేన్‌కు రూ.18,500, వాచ్‌మేన్‌కు రూ.10,500 చొప్పున వేతనాలు ఇచ్చేవారు. ప్రస్తుతం అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ప్రభుత్వ మద్యం దుకాణాలను తొలగించి ప్రయివేట్‌కు అప్పగించేందుకు ప్రయత్నాలు మొదలు పెట్టింది. అందులో భాగంగానే మంగళవారం మద్యం దుకాణాలకు నోటిఫికేషన్ కూడా ఇచ్చింది.

మద్యం దుకాణాలు బంద్

2019 నుంచి ప్రభుత్వ మద్యం దుకాణాల్లో పని చేస్తున్న తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని ఉద్యోగులు మంగళవారం ఆందోళన బాట పట్టారు. మద్యం దుకాణాలను బంద్ చేసి ఎక్సైజ్ శాఖ కార్యాలయం ముందు నిరసన చేపట్టారు. తమతో చేసుకున్న ఒప్పందం ముగిసిందని కొత్తగా నెలకొల్పే మద్యం దుకాణాల వల్ల ఉపాధి కోల్పోయామని, తమకు న్యాయం చేయాలని ఆవేదన వ్యక్తం చేశారు. పలుమార్లు తమ విన్నపాన్ని ముఖ్యమంత్రి, ప్రభుత్వ ఉన్నతాధికారులకు తెలియజేసినట్లు తెలిపారు. తమ పట్ల ఎలాంటి నిర్ణయం తీసుకోకుండానే నూతన మద్యం పాలసీ అమలుకు ప్రభుత్వం చర్యలు చేపట్టడం వల్ల న్యాయం జరగదని చెప్పారు. మద్యం దుకాణాల బంద్‌తో ప్రభుత్వానికి నష్టం కలిగిందని ఎక్సైజ్ శాఖ అధికారులు ఉద్యోగులతో చర్చలు జరిపారు. జిల్లాకు ఒకరు చొప్పున ఈనెల 5న ఎక్సైజ్ శాఖ ఉన్నత అధికారులతో చర్చలకు ఏర్పాటు చేస్తున్నామని, సమ్మె విరమించాలని కోరడంతో ఉద్యోగులు ఆందోళన వీడారు.

నిరసన వ్యక్తం చేస్తున్న ఉద్యోగులు

చేనేత కార్మికులను ఆదుకోవడంలో ప్రభుత్వాలు విఫలం

- ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి రాజు

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

చేనేత కార్మికులను ఆదుకోవడంలో ప్రభుత్వాలు విఫలం చెందుతున్నాయని ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కె.రాజు విమర్శించారు. మంగళవారం పట్టణంలోని సుందరయ్య భవన్‌లో చేనేత కార్మిక సంఘం పట్టణ నాయకులు కె.లక్ష్మణ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడారు. చేనేత కార్మికులు పని లేక ఇతర వృత్తులకు వెళ్తున్నారని తెలిపారు. పవర్ లూమ్‌తో పోటీ తట్టుకోలేకపోతున్నారని చెప్పారు. రాష్ట్రంలో గత ప్రభుత్వం 'నేతన్న నేస్తం' ద్వారా రూ.24 వేలు ఇచ్చేదని తెలిపారు. ప్రస్తుత ప్రభుత్వం అందించడం లేదన్నారు. కార్మికులు తయారు చేస్తున్న వస్త్రాలకు మార్కెటింగ్ సౌకర్యాలు కల్పించాలని కోరారు. చేనేత కార్మికులకు గుర్తింపు కార్డులు అందజేయాలని డిమాండ్ చేశారు. చేతి వృత్తిదారుల సంఘం జిల్లా కార్యదర్శి గోవిందు మాట్లాడుతూ... పట్టణంలో 60 శాతం జనాభా చేనేత వృత్తిపై ఆధారపడి జీవిస్తున్నారని తెలిపారు. టెక్స్‌టైల్ పార్క్ పెడతామంటూ పేర్కొందని, ఇంతవరకు దానిపై స్పందించడం లేదని చెప్పారు. టెక్స్‌టైల్ పార్క్‌ను త్వరగా పూర్తిచేసి అందులో స్థానికులకే పని కల్పించాలని కోరారు. మూత పడిన సొసైటీలను తెరిపించాలని, బకాయిలు చెల్లించాలని తెలిపారు. సొసైటీల ద్వారా చేనేత కార్మికులకు ఉపాధి కల్పించాలన్నారు. మూడు సెంట్ల స్థలాన్ని ఇచ్చి ఇంటితోపాటు చేనేత షెడ్ నిర్మించాలని డిమాండ్ చేశారు. చేనేత కార్మిక సంఘం పట్టణ కార్యదర్శి భరణి కాలప్ప మాట్లాడుతూ... గాంధీ జయంతి సందర్భంగా చేనేత కార్మిక సంఘం ఆధ్వర్యంలో నిర్వహించే ర్యాలీని జయప్రదం చేయాలని కోరారు. చేనేత కార్మిక సంఘం నాయకులు ఎం.కృష్ణ, శ్రీనివాసులు, వెంకటేశ్వర్లు, ఎల్లప్ప, జిబి.వీరన్న రాముడు, తిమ్మప్ప పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న రాజు

టిడిపి విధేయులుగా పార్టీ ఆదేశాలను గౌరవిస్తాం

మాట్లాడుతున్న వెంకటేష్ స్వామి

- టిడిపి మండల అధ్యక్షులు పన్నగ వెంకటేష్ స్వామి

ప్రజాశక్తి - మంత్రాలయం

టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జీగా అధిష్టానం ఎవరికి బాధ్యతలు అప్పగించినా పార్టీ విధేయులుగా ఆదేశాలను గౌరవిస్తామని టిడిపి మండల అధ్యక్షులు పన్నగ వెంకటేష్ స్వామి తెలిపారు. మంగళవారం ఆయన స్వగృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. టిడిపి నియోజక వర్గ ఇన్‌ఛార్జీగా మాధవరం రాఘవేంద్ర రెడ్డిని పార్టీ ఆదేశించినట్లు చెప్పుకొని బాణసంచా పేల్చి టిడిపి శ్రేణులను, ప్రజలను మభ్య పెట్టారని విమర్శించారు. 'ఇన్‌ఛార్జీ ప్రకటనతో రాఘవేంద్ర రెడ్డి గ్రూపులో సంబరాలు, తిక్కారెడ్డి గ్రూపులో దిగులు' అంటూ పత్రికల్లో రాయించుకోవడం వారికే చెల్లిందని మండిపడ్డారు. టిడిపి మండల అధ్యక్షులుగా అధిష్టానం వద్ద తనకు గుర్తింపు ఉందని, రాఘవేంద్ర రెడ్డికి కానీ, ఆయన మద్దతుదారులకు కానీ ఎలాంటి హోదా ఉందో చెప్పాలని కోరారు. అందరిదీ టిడిపి కుటుంబం అయినప్పటికీ 'తిక్కారెడ్డి గ్రూపుగా మీకై మీరు చిత్రీకరించుకుంటే అందుకు మేమెలా బాధ్యులమవుతామ'ని ప్రశ్నించారు. ఇప్పటి వరకు పార్టీ అధిష్టానం నియోజకవర్గ ఇన్‌ఛార్జీ బాధ్యతలు ఎవరికీ కేటాయించలేదని తెలిపారు. ఎవరికి కేటాయించినా పార్టీ మాటకు కట్టుబడి పార్టీ బలోపేతానికి, అభివృద్ధికి కృషి చేస్తామని చెప్పారు. బీసీ సెల్ అధ్యక్షులు అమర్‌నాథరెడ్డి, క్లస్టర్ ఇన్‌ఛార్జీ ఎల్లారెడ్డి, యూనిట్ ఇన్‌ఛార్జీ గువ్వల భీమన్న, మీడియా కోఆర్డినేటర్ విజయరామిరెడ్డి, బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి వట్టెప్పగారి నరసింహ, విద్యాకమిటీ ఛైర్మన్ గనేకంటి గురురాజ, హండే అనుమంతు, వనికె నాగరాజు, గనేకంటి రఘు, గనేకంటి రామకృష్ణ, తెలుగు యువత మండల కార్యదర్శి సాయికుమార్, ఎస్సీ సెల్ జిల్లా కార్యదర్శి ఏబు, వనికె భీమేష్ పాల్గొన్నారు.

ఎక్సైజ్ సిఐ బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

ఎక్సైజ్ సిఐగా రమేష్ రెడ్డి మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ సిఐగా విధులు నిర్వహించిన భార్గవ రెడ్డి బదిలీపై కోసిగి ప్రాంతానికి వెళ్లారు. అదే స్థానంలో మదనపల్లి ఎక్సైజ్ స్టేషన్‌లో సిఐగా విధులు నిర్వహిస్తున్న రమేష్ రెడ్డి బదిలీపై ఇక్కడకొచ్చారు.

క్రీడా దుస్తులు వితరణ

ప్రజాశక్తి - చిప్పగిరి

స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరగనున్న రాష్ట్రస్థాయి రగ్బీ అండర్-14, అండర్-17కు ఎంపికైన విద్యార్థినులకు నేమకల్లు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు పెద్ద నాగన్న మంగళవారం క్రీడా దుస్తులను వితరణ చేశారు. బాలికలు క్రీడల్లో రాణించడం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు. గ్రామీణ క్రీడాకారులు అన్ని రంగాల్లో రాణించినప్పుడే వారి భవిష్యత్తు ఉజ్వలంగా ఉంటుందని ఆయన తెలిపారు.

పేరుమార్పు

నేను ఎస్.అరుణ, D/o ఎస్.రాచోటి, నివాసం : డి.నెం. 3-86, ఆలూరు రోడ్డు, సులువాయ్, విరుపాపురం, కర్నూలు, ఆంధ్రప్రదేశ్- 518346. నా యొక్క పూర్వపు పేరు **S.అరుణ** అని ఆధార్‌లో తప్పుగా నమోదు కాబడ్డది. నా అసలు పేరు **సూరిసెట్టి గౌరి.** కావున నేటి నుండి నా పేరును **సూరిశెట్టి గౌరి D/o ఎస్.రాచోటి (SURI SETTY GOWRI, D/o S. RACHOTI)** గా పిలవబడును.
ఆధార్‌లో పేరు మార్పు కొరకు.

మహారాజశ్రీ కర్నూలు 4వ అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో (P&E)

O.S.No. 265/2024

మహమ్మద్ మహబూబ్‌శరిఫ్ ... వాది

-Vs-

చాకలిరాజు వగైరా ... ప్రతివాదులు

1,2 ప్రతివాదులకు దావా సమన్లు

1) చాకలిరాజు S/o. Late సి. సంజన్న, R/o. H.No. AN/B48, ఎ. క్యాంప్, కర్నూలు.
2) సయ్యద్ షేక్‌షా, S/o. సయ్యద్ గౌస్, H.No. 46/86-48A, బుధవారపేట, కర్నూలు.

1) పై నెంబరు దావాలో వాది ప్లెంట్ షెడ్యూలు దాఖల ఆస్తిని ఖాళీ చేసి స్వాధీనం చేయమని వాది యొక్క హక్కును దృఢపరచడమని వాదియె యజమాని అని కోరుతూ, (2) మరియు 1-11-2022వ తేదీన విక్రయ సేల్ దస్తావేజు నెంబరు 16826/2022 రద్దు చేయమని మరియు కోర్టు ఖర్చులు ఇప్పించమని కోరుతూ దావా దాఖలు చేసినాడు. ఇందులో 1,2 ప్రతివాదులు అయిన మీకు ఆక్షేపణఉన్న 24-10-2024వ తేదీన పగలు 10-30 గం॥లకు పై కోర్టులో హాజరై తెలుపుకొనవలయును. లేని యెడల పరోక్షమున విచారించి తీర్మానించబడును.

షెడ్యూలు :

The House site land Plot No. 361 in Sy. No. 19-1, 336,337,339 and 340/3 with the extent of 3 cents situated at B. Thandrapadu Village, Kurnool Mandal and Kurnool Dist. with in the limits of district Registration of Kurnool. Sub Registratoin office of Kurnool Bounded by East-Plot No. 362, Land Site West-Road, North-Plot No. 380 Land Site, South-Road.

కోర్టు వారి ఉత్తర్వు మేరకు

మహమ్మద్ కిరణ్
వాదిపరం అడ్వకేటు, కర్నూలు.

జెండా ఆవిష్కరణ అంటే ధైర్యం ఇవ్వడం

- కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆనంద్ బాబు

ప్రజాశక్తి - మంత్రాలయం

జెండా ఆవిష్కరణ అంటే బడుగు, బలహీన వర్గాలకు ధైర్యమివ్వడమని కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎమ్‌డి.ఆనంద్‌బాబు తెలిపారు. మంగళవారం మండలంలోని మాధవరం గ్రామంలో కెవిపిఎస్ నాయకులు జి.సురేష్, మారెప్ప అధ్యక్షతన జెండావిష్కరణ చేపట్టారు. ముఖ్య అతిథులుగా ఆనంద్ బాబు, కెవిపిఎస్ జిల్లా ఉపాధ్యక్షులు హెచ్.జయరాజు, మండల అధ్యక్షులు ఈరన్న, మండల కార్యదర్శి అంజి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. జెండాను ఎగరవేయడమంటే బడుగు, బలహీన వర్గాలకు జరుగుతున్న అన్యాయాలను, అరాచకాలను అరికట్టడానికి 'మేమున్నామ'నే సంకేతం ఇచ్చేందుకు అని తెలిపారు. కుల వివక్ష నిర్మూలనతో ఆత్మగౌరవం కలిగి సమానత్వంతో జీవించడమన్నారు. నేటికీ ప్రతి గ్రామంలోనూ వివక్షత గూడు కట్టుకొని ఉందని, దాన్ని కూకటి వేళ్లతో పెకలించేవరకు పోరాటం ఆగదని తెలిపారు. జిఒ 1235 కింద ప్రతి గ్రామంలో రెండెకరాల స్థలం శ్మశాన వాటికలకు కేటాయించాలని కోరారు. డప్పు కళాకారుల ఆత్మగౌరవం కోసం రెండెకరాల పొలాన్ని ఇవ్వాలని జిఒను పాస్ చేసినట్లు తెలిపారు. నేటికీ గ్రామాల్లో గట్లపైన, కొండచాటున పొలాల్లో మృతదేహాలను పూడ్చుతున్నారని చెప్పారు. ఎస్సీ కార్పొరేషన్ నిధులను ఎస్సీలకు ఉపయోగించకుండా పెత్తందారులకు ఉపయోగిస్తున్నారని విమర్శించారు. పెద్దకడబూరు మండలం కల్లుకుంట గ్రామంలో దళిత గోవిందమ్మ ను విద్యుత్ స్తంభానికి కట్టేసి కొట్టడం, బట్టలు ఊడదీయడం దారుణమని తెలిపారు. ఇలాంటి సమస్యలు ఇంకా ఎన్నో ఉన్నాయని, వాటిని పరిష్కరించుకోవాలంటే ఒక సంఘంగా ఐకమత్యంతో ఉండాలని చెప్పారు. ఆనంద్‌బాబు, జయరాజు, అంజికి శాలువా, పూలమాల వేసి సన్మానించారు. కెవిపిఎస్ మాధవరం గ్రామ అధ్యక్షులు తలమారి నడిపి తిక్కన్న, ఉపాధ్యక్షులు రామచంద్ర, హనుమంతు, కార్యదర్శి మేకల చిన్న ఆంజనేయ, కమిటీ సభ్యులు అశోక్, దేవా, ఎలీషా, ఇశ్రాయేల్, ఆదాము, ఎం.రవి, బాలరాజు, లారెన్స్, గ్రామ పెద్దలు దైమన్న, చిన్న ఏసేపు, దైమన్న లాజర్, ప్రభాకర్, శివ, జీవన్, దేవి పుత్ర, సౌండ్ సిస్టం ఏలియా పాల్గొన్నారు.

జెండాను ఆవిష్కరిస్తున్న నాయకులు

మాట్లాడుతున్న ఆనంద్ బాబు

బాబును కలిసిన టిడిపి ప్రముఖులు

ప్రజాశక్తి - మంత్రాలయం

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును టిడిపి ప్రముఖులు కలిసి సమస్యలను నివేదించారు. మంగళవారం పత్తికొండ సమీపంలో ఉన్న పుచ్చకాయలమాడకు పింఛన్ల పంపిణీకి వచ్చిన ఆయనను టిడిపి జిల్లా అధ్యక్షులు పాలకుర్తి తిక్కారెడ్డి, నియోజకవర్గ నాయకులు ఎన్.రాఘవేంద్ర రెడ్డి, తెలుగు రైతు రాష్ట్ర అధికార ప్రతినిధి నరవ రమాకాంత రెడ్డి, టిడిపి మండల అధ్యక్షులు పన్నగ వెంకటేష్ స్వామిలు మర్యాద పూర్వకంగా కలిశారు. జిల్లా సమస్యలపై, నియోజకవర్గ అభివృద్ధికి చేపట్టాల్సిన చర్యలపై తిక్కారెడ్డి చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లారు. నియోజకవర్గ ప్రజలకు సాగు, తాగునీరు అందించేందుకు తుంగభద్ర నదిపై వంతెనతో ఆనకట్టకు నిధులు మంజూరు చేయాలని కోరారు. విజయవాడ వరద బాధితులకు సేకరించిన సుమారు రూ.5 లక్షల చెక్కును చంద్రబాబుకు అందజేశారు.

జిల్లాస్థాయి పోటీలకు 'రెయిన్ బో' విద్యార్థి

ప్రజాశక్తి - పెద్దకడబూరు

పెద్దకడబూరులోని రెయిన్ బో ఇంగ్లీష్ మీడియం హైస్కూల్‌లో 7వ తరగతి చదువుతున్న బిఆర్.నవీన్ కుమార్ జిల్లాస్థాయి ఖోఖో పోటీలకు ఎంపికైనట్లు కరస్పాండెంట్ గోవిందరెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఇటీవల కోసిగిలో జరిగిన ఎస్‌జిఎఫ్ అండర్-14 విభాగంలో తాలూకా స్థాయి ఖోఖో పోటీల్లో రెయిన్ బో ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ విద్యార్థి నవీన్ కుమార్ ప్రతిభ చాటి జిల్లాస్థాయి పోటీలకు ఎంపికయ్యారని తెలిపారు. విద్యార్థిని పాఠశాల డైరెక్టర్ రంగారెడ్డి, ప్రధానోపాధ్యాయులు ప్రసాద్, ఉపాధ్యాయులు జె.పుల్లయ్య, రామకృష్ణ, అశోక్, పిఇటి అంజి అభినందించారు.

ఆర్ట్స్ కళాశాల అధ్యాపకునికి పిహెచ్‌డి పట్టా

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

మ్యూచువల్ ఫండ్స్ పట్ల పెట్టుబడిదారుల ప్రాధాన్యత, సంతృప్తి స్థాయి గురించి పరిశోధన చేయడం వల్ల మంగళవారం పిహెచ్‌డి ప్రదానం చేశారు. పట్టణంలోని ఆదోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో విధులు నిర్వహిస్తున్న అధ్యాపకులు అశోక్ తమిళనాడులో భారతీదాసన్ విశ్వవిద్యాలయంలోని ఎస్‌కెఎస్‌ఎస్ ఆర్ట్స్ కళాశాలలో పిహెచ్‌డి పూర్తి చేసి పట్టా పొందారు. హెచ్‌ఒడి ఆఫ్ కామర్స్ డాక్టర్ జి.చంద్ర, కళాశాల ప్రిన్సిపల్ శేఖర్ చేతుల మీదుగా పట్టా పొందినట్లు అశోక్ తెలిపారు.

పోటాపోటీగా పింఛన్ల పంపిణీ

ప్రజాశక్తి - మంత్రాలయం

ప్రభుత్వం విడుదల చేసిన పింఛన్ల పంపిణీని టిడిపిలోని ఇరు గ్రూపులు పోటాపోటీగా పంపిణీ చేశాయి. మంగళవారం టిడిపి మండల అధ్యక్షులు పన్నగ వెంకటేష్ స్వామి ఆధ్వర్యంలో టిడిపి జిల్లా అధ్యక్షులు పాలకుర్తి తిక్కారెడ్డి కుమారుడు, తెలుగు యువత జిల్లా ప్రధాన కార్యదర్శి పాలకుర్తి దివాకర్ రెడ్డి స్థానిక పాత ఊరులో లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేశారు. టిడిపి నియోజకవర్గ నాయకులు ఎన్.రాఘవేంద్ర రెడ్డి మండలంలోని కలుదేవకుంట గ్రామంలో లబ్ధిదారులకు పింఛన్లు అందజేశారు. మరోవైపు రాఘవేంద్ర రెడ్డి సోదరులు ఎన్.రఘునాథ్ రెడ్డి మండలంలోని మాధవరం గ్రామంలో పింఛన్లు అందించగా, స్థానిక రాఘవేంద్ర నగర్ కాలనీలో టిడిపి పట్టణ ఇన్‌ఛార్జీ బి.వరదరాజులు, నాయకులు అశోక్ రెడ్డి ఆధ్వర్యంలో పింఛన్లు పంపిణీ చేశారు. **కౌతాళంలో** తెలుగు రైతు జిల్లా కార్యదర్శి అల్లూరి వెంకటపతి రాజు పుట్టినరోజు సందర్భంగా కూటమి నాయకులు ఇంటింటికీ వెళ్లి పింఛనుతో పాటు స్వీట్లు, పండ్లు పంపిణీ చేశారు. వెంకటపతి రాజు మాట్లాడుతూ... పింఛన్ల పంపిణీ రోజే తన పుట్టినరోజు ఉండడం వృద్ధులు, వికలాంగులు, వితంతువులకు పింఛనుతో పాటు స్వీట్లు, ఫలహారాలు పంపిణీ చేయడం సంతోషంగా ఉందని తెలిపారు. మాజీ ఎంపిటిసి చౌదరి బసవరాజు, రాజానంద్, ముక్కన్న, గిరి, జనసేన మండల నాయకులు రామాంజనేయులు, రాంబాబు, చిరంజీవి, లింగేష్, వలీ, గొట్టయ్య, నరసప్ప, అద్దాల శ్రీరామ్, రమేష్, నాగేష్, గురు పాల్గొన్నారు. మంత్రాలయం నియోజకవర్గ నాయకులు రాఘవేంద్ర రెడ్డి, టిడిపి సీనియర్ నాయకులు ఉల్లిగయ్య ఆదేశాల మేరకు మండలంలో పింఛన్లు పంపిణీ చేశారు. అలాగే టిడిపి జిల్లా అధ్యక్షులు తిక్కా రెడ్డి ఆదేశాల మేరకు కౌతాళంలో జిల్లా ఉపాధ్యక్షులు చెన్న బసప్ప ఆధ్వర్యంలో పింఛన్లు పంపిణీ చేశారు. టిడిపి టౌన్ ప్రెసిడెంట్ కాశీ విశ్వనాథ్, సిద్ధు, మంజు పాల్గొన్నారు. ఉరుకుందలో బీసీ సెల్ జిల్లా ఉపాధ్యక్షులు కురుగోడు ఆధ్వర్యంలో పింఛన్లు పంపిణీ చేశారు.



పింఛన్లు పంపిణీ చేస్తున్న రాఘవేంద్రరెడ్డి

పింఛన్లు పంపిణీ చేస్తున్న వెంకటేష్ స్వామి



కౌతాళంలో పింఛన్లు పంపిణీ చేస్తున్న నాయకులు

బడికి వెళ్లి పింఛను అందజేత

ఆదోనిరూరల్ : మండలంలోని పెద్ద హరివాణం గ్రామానికి చెందిన వికలాంగుడు చాగప్ప పింఛను తీసుకుంటున్నారు. ఈనెల 1న పింఛన్ల అందజేతలో భాగంగా మంగళవారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యనభ్యసిస్తున్న చాగప్పకు పంచాయతీ కార్యదర్శి షేక్ అహ్మద్ పాఠశాలకు వెళ్లి పింఛను అందజేశారు. లబ్ధిదారుడు ఆయన కుటుంబ సభ్యులు ప్రభుత్వానికి, పంచాయతీ కార్యదర్శికి కృతజ్ఞతలు తెలిపారు.

పింఛను అందిస్తున్న పంచాయతీ సెక్రటరీ

సర్టిఫికెట్లు అందజేస్తున్న నాయకులు

మండల స్థాయి చెకుముకి సైన్స్ టాలెంట్ టెస్ట్

ప్రజాశక్తి - కౌతాళం

మండలంలో జెవివి ఆధ్వర్యంలో మండల స్థాయి చెకుముకి సైన్స్ టాలెంట్ టెస్ట్‌ను మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా చెకుముకి సైన్స్ టాలెంట్ టెస్ట్ ప్రశ్నాపత్రాన్ని కౌతాళం ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఇమ్మానుయేల్, యుటిఎఫ్ నాయకులు శ్రీనివాసులు ఆవిష్కరించారు. పరీక్షకు మండలం నుంచి వివిధ పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఈ పరీక్షల్లో ప్రతిభ ఇంగ్లీష్ మీడియం స్కూల్ విద్యార్థులు ప్రథమ స్థానంలో నిలువగా, ఎరిగేరి ఉన్నత పాఠశాల విద్యార్థులు ద్వితీయ స్థానంలో నిలిచారు. తృతీయ స్థానంలో కౌతాళం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నిలిచింది. ప్రథమ స్థానంలో నిలిచిన విద్యార్థులు ఈనెల 27న జరగబోయే జిల్లా స్థాయి చెకుముకి పరీక్షకు హాజరు కావాలన్నారు. యుటిఎఫ్ నాయకులు సుధాకర్, వెంకటేశ్వర్లు, మంగరాజు, ఈరన్న, తేజప్ప, ఉపాధ్యాయులు నరసింహులు, శ్రీనివాసులు, శైలజ, బసవరాజు పాల్గొన్నారు.

అధిక లోడ్ వాహనాలతో రోడ్లు ధ్వంసం

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

అధిక లోడ్‌తో వెళ్తున్న వాహనాలతో రోడ్లు ధ్వంసమవుతున్నాయిని మండలంలోని పెద్దహరివాణం గ్రామానికి చెందిన మెడికల్ నాగరాజ్ తెలిపారు. మంగళవారం రవాణా శాఖ ఇన్‌స్పెక్టర్ సుధాకర్ రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఆదోని-శిరుగుప్ప రహదారిలో ఓవర్ లోడ్ లారీలతో రోడ్లన్నీ పాడవుతూ, దుమ్ము రేగుతూ జనానికి అవస్థలు తప్పడం లేదని తెలిపారు. అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని విమర్శించారు. నిబంధనల ప్రకారం 10 టన్నులకే రవాణా చేయాల్సిన ఉండగా, 20 నుంచి 60 టన్నుల లోడ్‌తో భారీ వాహనాలు ప్రయాణించడంతో రోడ్లు, కల్వర్టులు ధ్వంసమవుతున్నాయని తెలిపారు. ఇప్పటికే గుంతలుగా ఏర్పడి ప్రజా రవాణా ఇబ్బందిగా మారిందని చెప్పారు. అధిక లోడ్‌తో వెళ్లే వాహనాలను నియంత్రించాలని, లేకపోతే గ్రామస్తులను సమీకరించి ఆందోళనకు సిద్ధమవుతామని హెచ్చరించారు.

పేద విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ

ప్రజాశక్తి - ఆదోని

పేద విద్యార్థులకు కావాల్సిన అవసరాలను తీర్చేందుకు తాము అందుబాటులో ఉంటామని అవోపా పట్టణ అధ్యక్షులు వంకదారు శ్రీనాథ్ గుప్తా తెలిపారు. మంగళవారం ఆదోనిలో గాంధీ జయంత్యుత్సవాల సందర్భంగా డీఎస్పీ బంగ్లా రోడ్డులో ఉన్న మున్సిపల్ ఎలిమెంటరీ స్కూల్‌లో నోటు పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గాంధీ జయంత్యుత్సవాలు నిర్వహించి పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. 45 మంది స్కూల్ పిల్లలకు ఉచితంగా నోటు పుస్తకాలు, పెన్నులు, మిఠాయిలు పంచి గాంధీ ఔన్నత్యాన్ని చాటి చెప్పామన్నారు. అవోపా ఉపాధ్యక్షులు ప్రతాప్, ఈరన్న శెట్టి, కోశాధికారి యాదగిరి వెంకటేశ్వర్లు, ప్రధానోపాధ్యాయులు వెంకటరాముడు పాల్గొన్నారు.

స్టేడియం ఏర్పాటు చేయాలి

- క్రికెట్ అసోసియేషన్ తాలూకా అధ్యక్షులు రమేష్

ప్రజాశక్తి - ఆదోని

పట్టణంలో క్రీడా నైపుణ్యం కలిగిన వారి ప్రతిభను ప్రదర్శించుకునేందుకు స్టేడియం ఏర్పాటు చేయాలని ఆదోని తాలూకా క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షులు విట్టా రమేష్ కోరారు. ఆదోని క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శిక్షణ పొందిన క్రీడాకారుడు యోధా శంకర్ రెడ్డి జిల్లా క్రికెట్ జట్టుకు ఎంపికయిన సందర్భంగా మంగళవారం అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పట్టణంలోని లీలా పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న యోధా శంకర్ రెడ్డి ఈ నెల 4 నుంచి 23 వరకు కడపలో జరిగే అండర్-14 ఇంటర్ డిస్ట్రిక్ట్ పోటీల్లో కర్నూలు జట్టు తరపున క్రికెట్ ఆడతారన్నారు. వైస్ ప్రెసిడెంట్లు ముజీబ్, మల్లప్ప, సెక్రటరీ వెంకటేష్, జాయింట్ సెక్రటరీ జెఎమ్.బాషా, వై.మహదేవ్, ట్రెజరర్ వెంకటేష్ బాబు, అసోసియేషన్ సభ్యులు కొల్లి రవీంద్ర, జొనాథన్, నాగరాజ్, సుధాకర్ రావు, కోచ్ బాలాజీ రావులు యోధా శంకర్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

50 శాతం సబ్సిడీతో శనగ విత్తనాలివ్వాలి : రైతుసంఘం

ప్రజాశక్తి - ఆస్పరి

రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన 25 శాతం సబ్సిడీ శనగ రైతులకు ఏ మాత్రం సరిపోదని, 50 శాతం సబ్సిడీతో విత్తనాలు ఇవ్వాలని ఎపి రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి హనుమంతు డిమాండ్ చేశారు. మంగళవారం రైతుసంఘం మండల కార్యదర్శి రంగస్వామి ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మూడేళ్ల నుంచి మండలంలో శనగ రైతులు అనావృష్టి, అతివృష్టితో నష్టపోతున్నారని తెలిపారు. రైతులకు సకాలంలో శనగ విత్తనాలు పంపిణీ చేయడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని మండి పడ్డారు. ఈ ఏడాది సకాలంలో వర్షాలు పడ్డాయని, ప్రభుత్వం రైతులకు 50 శాతం సబ్సిడీతో విత్తనాలు పంపిణీ చేయాలని కోరారు. రైతుసంఘం మండల అధ్యక్షులు మధు రెడ్డి, సీనియర్ నాయకులు రంగప్ప, మల్లికార్జున రెడ్డి, చిన్న ఈరన్న, రవి పాల్గొన్నారు. **ఆలూరు** వ్యవసాయ సంచాలకుల కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్ మంజునాథకు వినతిపత్రం అందజేశారు. ఎపి రైతు సంఘం మండల కార్యదర్శి యు.ఈరన్న, రైతులు పరమేష్ గౌడ్, రంగస్వామి, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

IN THE COURT OF THE HON'BLE ADDITIONAL SENIOR CIVIL JUDGE, KURNOOL.

E.P. No. 151/2019 IN O.S.No.54/2007
M. Abdul Wahid, died by L.Rs
1. Mohammed Ibrahim & others
.... Petitioners / D.Hrs.
- Versus -
Syed Buranuddin Khadri, died by L.Rs (12 to 17) and others
...... Respondents / J.Drs.

జడ్జిమెంట్ డెటార్స్ / రెస్పాండెంట్స్ 13,20,25,27 నుండి 30 లకు నోటీసు U/o 021Rule 22 CPC

1. Syed Maqbul Basha Khadri, (J.Dr.No.13) S/o late S. Buranuddin Khadri, Aged about 68 years, Residing at H.No.59-122, Vaddegeri Street, Kurnool.
2. Sayeda Shafiunnisa, (J.Dr.No.20)D/o late Syed Nazeer Basha Khadri, Aged about 29 years, House-wife, R/o H.No.26/181, Chittari Street, Kurnool City.
3. Sayeda Rizwana, (J.Dr.No.25) D/o late Syed Noorullah Khadri, Aged about 28 years, House-wife,R/o H.No.26/181, Chittari Street, Kurnool City.
4. Sayeda Faheemunnisa, (J.Dr.No.27) W/o late Syed Shabbir Basha Khadri, Aged about 46 years, Employee, R/o H.No.26/181, Chittari Street, Kurnool City.
5. Sayeda Ayesha Thabassum, (J.Dr.No.28) D/o late Syed Shabbir Basha Khadri, Aged about 26 years, Employee,R/o H.No.26/181, Chittari Street, Kurnool City.
6. Syed Afroz Hussain, (J.Dr.No.29)S/o late Syed Shabbir Basha Khadri, Aged about 23 years, Employee, R/o H.No.26/181, Chittari Street, Kurnool City.
7. Syed Arif Hussain, (J.Dr.No.30)S/o late Syed Shabbir Basha Khadri, Aged about 21 years, Employee, R/o H.No.26/181, Chittari Street, Kurnool City.

పై కనబరచిన డిక్రీ హోల్డర్స్ / పిటిషనర్స్ O.S.No. 54 / 2007 డిక్రీని అమలు పరచగోరి, సదరు డిక్రీ తేది అమలుకు రెండు సంవత్సరాలు దాటిపోయినందున Under Order-21, Rule-22 C.P.C. నోటీసులు జారీ చేయవలసి వుంటున్నది. పైన కనబరచిన జడ్జిమెంట్ డెటార్స్ / రెస్పాండెంట్స్ 13,20,25,27 నుండి 30 లకు సదరు నోటీసులు ముట్టనందున పేపరు ప్రకటన ఇవ్వమని కోర్టువారు ఉత్తర్వులు జారీచేసినందున, మీకందరికి నోటీసు ఈ ప్రకటన ద్వారా తెలియపరచడమైనది. కనుక పై కనబరచిన జడ్జిమెంట్ డెటార్స్ / రెస్పాండెంట్స్ 13,20,25,27 నుండి 30 అందరూ తేది **14-10-2024 ఉదయం 10:30 గంటలకు** మీరు స్వయముగా కాని, అడ్వకేటు ద్వారా కాని పై కోర్టులో హాజరై పై విషయములో మీకేమైనా అభ్యతరములుంటే తెలుపుకోవలసినదిగా తెలియజేయడమైనది. అట్లు మీరు కోర్టుకు హాజరు కాని పక్షములో కోర్టువారు మీ పరోక్షములో సదరు అర్జీని తీర్మానించెదరని ఈ నోటీసు మూలకంగా తెలియ పరచడమైనది.

పి.వి.సుధాకర రెడ్డి,
డిక్రీ హోల్డర్స్ తరఫు న్యాయవాది,
కర్నూలు. ఫోన్ : 9393833155

జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీతను సన్మానిస్తున్న ఎంఈఓ

ఉత్తమ ఉపాధ్యాయునికి సన్మానం

ప్రజాశక్తి - బనగానపల్లె : జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత, యుటిఎఫ్ మండల అధ్యక్షులు, పట్టణంలోని కస్బా ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు ప్రతాప్‌ను మంగళవారం పాఠశాలలో హెచ్ఎం వై.సుంకన్న అధ్యక్షతన ఎంఈఓలు ఎన్.స్వరూప, ఎం.శ్రీనివాసులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎంఇఒ స్వరూప మాట్లాడుతూ ప్రతాప్ జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు పొందడం హర్షనీయమన్నారు. కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా సహాధ్యక్షులు సత్య ప్రకాష్, జిల్లా ఆడిట్ కన్వీనర్ యు.దస్తగిరి, కస్బా ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు అబ్దుల్ కలీం,ఎం పుష్పలత, బి లక్ష్మీదేవి, తెలుగు పేట పాఠశాల ఉపాధ్యాయులు చల్లా కృష్ణయ్య, కేయం నాగరాజు, అబ్దుల్ షరీఫ్, టి అబ్దుల్లా, కొండపేట పాఠశాల హెచ్ఎం రామచంద్రారెడ్డి, అబ్దుల్ వహీద్, ఎంఆర్‌సి సిబ్బంది శివరాం మద్దిలేటి, ప్రసాద్ పాల్గొన్నారు.

మధ్యంతర భృతి ప్రకటించాలి

ప్రజాశక్తి - చాగలమర్రి : రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయులకు 30 శాతం మధ్యంతర భృతి ప్రకటించాలని రాష్ట్ర పిఆర్‌టియు కౌన్సిలర్ బి.రవీంద్రారెడ్డి కోరారు. మంగళవారం స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులకు సంబంధించిన ఎంతో కాలంగా పెండింగులో ఉన్న సరెండర్ లీవ్స్, ఏపిజిఎల్ఐ, డిఏ, ఎరియర్స్ వెంటనే మంజూరు చేయాలన్నారు. 11వ పిఆర్‌సి అమలు సందర్భంలో జరిగిన నష్టాన్ని 12వ పిఆర్‌సిలో సరిదిద్ది న్యాయం చేయాలన్నారు. కొత్త పిఆర్‌సి 2023 జూలై 1 నుండి అమలు చేయాల్సి ఉన్న నేటికి అమలు కాలేదని పేర్కొన్నారు. సాధ్యమైనంత త్వరగా సానుకులంగా పై విషయంలపై ప్రభుత్వం స్పందించి, వాటి అమలుకు చర్చలు తీసుకోవాలని డిమాండ్ చేసారు. కార్యక్రమంలో పిఆర్‌టియు జిల్లా కౌన్సిలర్ నారాయణ మూర్తి, నరసింహారెడ్డి, విజయభాస్కర్ రెడ్డి, దాదాపీర్, సూర్యం, సహదేవరెడ్డి, మాబుభాష, శ్రీనివాసలు, మద్దిలేటిరాజు హరిహరనాథరెడ్డి, ఉపాధ్యాయినీలు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీలకు ఆళ్లగడ్డ విద్యార్థులు ఎంపిక

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ

రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీలకు ఆళ్లగడ్డ విద్యార్థులు ఎంపికయ్యారు.. గత నెల 30వ తేదీన రాష్ట్రస్థాయి స్కూల్స్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నంద్యాలలోని పద్మావతి నగర్ ఇండోర్ స్టేడియంలో ఉమ్మడి కర్నూలు జిల్లా స్థాయి తైక్వాండో పోటీలు నిర్వహించారు. ఈ పోటీలలో అరుణోదయ యూపీ స్కూల్‌కు చెందిన అయినియా, సెయింట్ ఆన్స్ పాఠశాలకు చెందిన జయరాజ్, గురు రఘువీర్ కుమార్, ఏవిఆర్ పాఠశాలకు చెందిన డింపుల్ రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారని మౌళి తైక్వాండో స్పోర్ట్స్ అకాడమీ శిక్షణ గురువు ఎల్.టి చంద్రమౌళి, ఆపుస్మ ఆళ్లగడ్డ యూనిట్ అధ్యక్షులు అమీర్ భాష తెలిపారు. విశ్వశాంతి విద్యానికేతన్‌కు చెందిన ధరణి సిల్వర్ మెడల్, రాఘవేంద్ర హైస్కూల్‌కు చెందిన జయంతి కుమార్ సిల్వర్ మెడల్ సాధించారన్నారు. వీరు రాష్ట్రస్థాయిలో కూడా రాణించాలని వారు ఆకాంక్షించారు.

పలు ప్రాంతాల్లో 'పొలం పిలుస్తోంది' కార్యక్రమాలు

ప్రజాశక్తి - పగిడ్యాల

వరి పంటలో అగ్గి, పాము పొడ తెగుళ్లు ఆశించే సమయంలో వాటిని గుర్తించాలని మండల వ్యవసాయ అధికారి జ్యోతి కుమార్ రైతులకు సూచించారు. పొలం పిలుస్తుంది కార్యక్రమంలో భాగంగా మంగళవారం మండలంలోని ప్రాతకోట, గణపురం గ్రామాలలో వరి పంటను వ్యవసాయ శాఖ సిబ్బందితో కలిసి ఎఒ పరిశీలించారు. ఈ సందర్భంగా జ్యోతి కుమార్ మాట్లాడారు. వరి పంటకు తెగుళ్లను గుర్తించి వ్యవసాయ అధికారుల సూచనల మేరకు నివారణ చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ, పశువర్ధక శాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు. **రుద్రవరం :** వరి పంటలో రైతులు యాజమాన్య పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడులు సాధించుకోవచ్చని సిరివెళ్ల మండల వ్యవసాయ అధికారి సుధాకర్ తెలిపారు. సిరివెళ్ల మండలంలోని కోటపాడు, గోవింద పల్లె, గ్రామాలలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు. **మహానంది** మండలంలోని అల్లినగరం, బుక్కాపురం గ్రామాలలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. మహానంది హార్టికల్చర్ రీసెర్చ్ స్టేషన్ ప్రిన్సిపల్ శాస్త్రవేత్త ఠాగూర్ నాయక్ అరటి పంటలో సాగు యాజమాన్య పద్ధతులు, పురుగులు మరియు తెగుళ్ల నివారణ గురించి రైతులకు సూచనలు ఇచ్చారు. మండల వ్యవసాయ అధికారి బి. నాగేశ్వర రెడ్డి, ఏఈఓ శ్రీనివాసరెడ్డి, గ్రామ ఉద్యాన సహాయకులు మౌనిక , వివిధ గ్రామాల ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు. **బేతంచెర్ల** పట్టణం, గొర్లగుట్ట గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం అగ్రికల్చర్ ఆఫీసర్ కిరణ్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించారు. కంది పంటలో వచ్చే ఎండు తెగులు, గూడ పురుగు తెగులు పట్ల రైతులు తగు జాగ్రత్తలను వివరించారు. డిప్యూటీ అసిస్టెంట్ సెక్యులర్ ఆఫీసర్ ప్రసాద్ రావు, వెటర్నరీ ఏడి వసంత లక్ష్మి, ఏఈఓ బెన్ని రాజు, అగ్రికల్చర్ అసిస్టెంట్ ప్రజ్ఞ, ఎంపీఈవో మాద లచ్చమ్మ, రైతులు పాల్గొన్నారు. **చాగలమర్రి** మండలంలోని చింతలచెరువు, డి.వనిపెంట గ్రామాలలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. రైతులకు వ్యవసాయంలో సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం పొలం పిలుస్తోంది కార్యక్రమం చేపట్టిందని మండల వ్యవసాయ అధికారి రంగ నేతాజీ తెలిపారు. పశు వైద్యులు దీపా కుమారి, ఏఈఓ మంజుల, విహెచ్ఏ, విఏఏ, ఏహెచ్ఏలు, రైతులు పాల్గొన్నారు. **అవుకు** మండలంలోని సింగన పల్లె గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని మండల వ్యవసాయ అధికారి అబ్దుల్ హక్ నిర్వహించారు. వరిలో యాజమాన్య పద్ధతులు, డ్రోన్ల ఆధునిక పరిజ్ఞాన్ని వివరించారు. అనంతరం మట్టి నమూనా పరీక్ష కార్డులను రైతులకు అందించారు. గ్రామ నాయకులు సాంబశివారెడ్డి, వ్యవసాయ ఉద్యానవన శాఖ అధికారులు రైతులు పాల్గొన్నారు. **నంద్యాల రూరల్ :** వరిపంటలో ఎలుకల ఉధృతి ఎక్కువగా ఉంటుంది కాబట్టి పంట ఐదు నుండి 10 శాతం వరకు దిగుబడి తగ్గే అవకాశం ఉంటుందని, కాబట్టి సామూహిక ఎలుకల నివారణ చర్యలు చేపట్టాలని ఏడిఏ రాజశేఖర్ పేర్కొన్నారు. మంగళవారం నంద్యాల మండలం కొత్తపల్లి, బిల్లలాపురం గ్రామాలలో మండల వ్యవసాయ అధికారి ఇ. ప్రసాద రావు ఆధ్వర్యంలో పొలంపిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఏఈఓ రవికుమార్, విఏఏలు చక్రిధర్ రెడ్డి, శివ నాయక్, విహెచ్ఏ అనూష, ఇరు గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, రైతులు పాల్గొన్నారు.

రుద్రవరంలో..

నంద్యాల మండలంలో..

పగిడ్యాలలో..

మహానందిలో..

చాగలమర్రిలో..

టిడిపి సభ్యత్వ నమోదు, పునరుద్ధరణపై కార్యాచరణ

- ముఖ్య నాయకులతో ఎన్ఎండి ఫిరోజ్ సమావేశం

ప్రజాశక్తి - నంద్యాల అర్బన్

నంద్యాల టీడీపీ సభ్యత్వ నమోదు, పునరుద్ధరణ కార్యక్రమ కార్యచరణపై మంగళవారం టిడిపి కార్యాలయం (రాజ్ టాకీస్) నందు ముఖ్య కార్యకర్తల (కౌన్సిలర్లు , యూనిట్ ఇంచార్జ్ , క్లస్టర్ ఇంచార్జ్ , వార్డు ఇంచార్జ్)లతో జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండి ఫిరోజ్ సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా ఎన్ఎండి ఫిరోజ్ మాట్లాడుతూ టీడీపీ సభ్యత్వ నమోదు అనేది ఒక గుర్తింపు మాత్రమే కాదని తెలుగుజాతి ఆత్మగౌరవాన్ని తెలుగు జాతి అభ్యున్నతి కోసం పాటుపడిన తెలుగుదేశం పార్టీలో సభ్యత్వం తీసుకోవడం అనేది గొప్ప చారిత్రాత్మక నిర్ణయమన్నారు. 100 రూపాయలు చెల్లించి సభ్యత్వం నమోదు చేసుకోవాలన్నారు . సభ్యత్వ నమోదు ద్వారా కార్యకర్తలకు ఏదైన అనుకోని సంఘటన జరిగినపుడు రూ.2లక్షల ఆర్థిక భరోసా కల్పించడం దేశ చరిత్రలో ఏ పార్టీ కూడా నిర్ణయం తీసుకోలేదన్నారు. సభ్యత్వం అందరూ నమోదు చేసుకుని రాష్ట్రంలోనే నంద్యాలను మొదటి స్థానంలో నిలపాలన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు కండే శ్యామ్ సుందర్ లాల్, నాగార్జున, శ్రీదేవి , జైనాభి, టిడిపి పట్టణ అధ్యక్షులు ఖలీల్ , సభ అధ్యక్షులు గోవిందు నాయుడు, వార్డు, గ్రామ ఇంచార్జ్, క్లస్టర్లు , యూనిట్ ఇంచార్జ్ నాయకులు పాల్గొన్నారు.



ప్రసంగిస్తున్న టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండి ఫిరోజ్

రెండో రోజు కొనసాగిన ఎస్‌జిఎఫ్ క్రీడలు

ఫోటో రైట్ అప్ రిబ్బన్ కట్ చేసి క్రీడలను ప్రారంభిస్తున్న దశ్యం

ప్రజాశక్తి - నందికొట్కూరు టౌన్

నందికొట్కూరు నియోజక వర్గ స్థాయి అండర్-17, 14 స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ బాలికల మీట్ కం సెలక్షన్స్ మంగళవారం 2వ రోజు నందికొట్కూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో కొనసాగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ షేక్ షావలి, జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల ఇన్చార్జి ప్రధాన ఉపాధ్యాయురాలు ఉషా రాణి హాజరై క్రీడలను లాంఛనంగా ప్రారంభించారు. అనంతరం అండర్ - 17 వాలీబాల్ క్రీడలో నందికొట్కూరు, జూపాడు బంగ్లా మండలాల క్రీడాకారులను పరిచయం చేసుకొని శుభాకాంక్షలు తెలియ జేశారు. ఈ సందర్భంగా స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ మాట్లాడుతూ క్రీడల్లో రిజర్వేషన్ ల ద్వారా ఉన్నత విద్య లోనూ,ఉద్యోగాల్లోనూ అవకాశాలు మెండుగా ఉన్నాయని వాటిని విద్యార్థినులు అందిపుచ్చుకోవాలని కోరారు. ఈ క్రీడలకు నందికొట్కూరు నియోజక పరిధిలోని 6 మండలాల లోని పాఠశాలల నుండి బాలికల దాదాపు 200 మంది క్రీడాకారిణులు హాజరయ్యారు. వాలీబాల్, ఖో- ఖో, కబడ్డీ, షటిల్ బ్యాడ్మింటన్, యోగా, చెస్ క్రీడలలో బాలికల విభాగంలో హోరాహోరీగా పోటీలు జరిగాయి. ఇక్కడ సెలెక్ట్ అయిన క్రీడాకారులు నియోజకవర్గ జట్టుగా ఏర్పడి కర్నూలులో జిల్లా స్థాయిలో జరిగే క్రీడల్లో పాల్గొంటారు. అనంతరం సాయంకాలం జరిగిన బహుమతి ప్రధాన వేడుకలో ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు రామిరెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై విజేతలకు ట్రోఫీలు బహూకరించారు. ఈ కార్యక్రమంలో స్కూలు గేమ్స్ ఫెడరేషన్ నియోజక వర్గ కో- ఆర్డినేటర్ కష్ణ , మండల ఎస్ జి ఎఫ్ కో-ఆర్డినేటర్లు వీరన్న, రాజశేఖర్, వెంకటేష్, శ్రీనివాసులు, మురళీ నాయక్, ఫిజికల్ డైరెక్టర్లు శ్రీనాథ్ పెరుమాళ్ళ, స్వామి దాసు రవికుమార్, రామకృష్ణ, శివన్న, సుంకన్న చంద్ర శేఖర్, వెంకటేశ్వర్లు, శ్రీధర్ కుమార్, డోరతి, పద్మలత జసింత, విజయకుమారి, రాజేశ్వరి, జయమ్మ, సరస్వతి, అరుణ, చెన్నమ్మ, పద్మ డిస్ట్రిక్ట్ స్పోర్ట్స్ అథారిటీ కబడ్డీ కోచ్ విక్రమ్, ప్రైవేటు పాఠశాలల వ్యాయామ ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్‌టి హక్కులకు భంగం కలగకుండా ప్రతిపాదనలు సిద్ధం చేయండి : కలెక్టర్

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

గ్రీన్ కో ఎలక్ట్రికల్ పవర్ ట్రాన్స్మిషన్ ఏర్పాటుకు సంబంధించి షెడ్యూల్ కులాల హక్కులకు భంగం కలగకుండా సబ్ డివిజనల్ కమిటీ సూచించిన ప్రతిపాదనలను ప్రభుత్వానికి పంపేందుకు సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో గ్రీన్ కో ఎలక్ట్రికల్ పవర్ లైన్ ట్రాన్స్మిషన్ ఏర్పాటుపై సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. జాయింట్ కలెక్టర్ సి. విష్ణు చరణ్, ఐటిడిఏ ప్రాజెక్టు డైరెక్టర్ సురేష్ కుమార్, జిల్లా గిరిజన సంక్షేమ అధికారి శివప్రసాద్, నంద్యాల, డోన్ ఆర్డీవోలు మల్లికార్జున రెడ్డి, మహేశ్వర్ రెడ్డిలు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ గ్రీన్ కో ఎలక్ట్రికల్ పవర్ లైన్ ట్రాన్స్మిషన్ ఏర్పాటు నిమిత్తం డోన్ డివిజన్ పరిధిలో 13.23 హెక్టార్లు, నంద్యాల డివిజన్లో 4 హెక్టార్లకు సంబంధించిన భూములు షెడ్యూల్ కులాల వారికి భంగం కలగకుండా గ్రామ సభలలో తీర్మానించిన ప్రతిపాదనలను జిల్లా జిల్లాస్థాయి కమిటీ పరిశీలించి ప్రభుత్వానికి పంపేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎస్టి కులాల వారి హక్కులకు భంగం కలగకుండా గ్రీన్ కో ఎలక్ట్రికల్ పవర్ లైన్‌లు వెళ్తున్నాయన్నారు. కార్యక్రమంలో సబ్ డివిజనల్ ఫారెస్ట్ ఆఫీసర్ సూర్యచంద్రరాజు తదితరులు పాల్గొన్నారు.

ఓటర్ల సవరణ పెండింగ్ దరఖాస్తులను పూర్తి చేయండి : కలెక్టర్

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

ఓటర్ల సవరణకు స్వీకరించి పెండింగ్‌లో ఉన్న క్లెయిమ్స్‌ను పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి అధికారులను ఆదేశించారు. మంగళవారం రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వివేక్ యాదవ్ తన కార్యాలయం నుండి ఓటర్ల సవరణ ప్రక్రియ-2025పై అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. కలెక్టరేట్లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి, జాయింట్ కలెక్టర్ సి విష్ణు చరణ్, డిఆర్వో ఏ పద్మజ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ నంద్యాల జిల్లాలో ఓటర్ల ఇంటింటి సర్వే ప్రక్రియ 99.07 శాతం పూర్తయిందని, వివిధ ఫారంలకు సంబంధించి 4,488 క్లెయిమ్స్ పెండింగ్ ఉన్నాయన్నారు. పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణ సంబంధించి అన్ని రాజకీయ పార్టీలతో సమావేశం నిర్వహించావన్నారు.ని ఆళ్లగడ్డ నియోజకవర్గంలో 10, నంద్యాల నియోజకవర్గంలో 5 పోలింగ్ కేంద్రాల ప్రతిపాదనలను సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు.

విద్యార్థులకు బహుమతులు ప్రదానం

ప్రజాశక్తి- శ్రీశైలం

స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమములో భాగంగా దేవస్థానం స్థానిక జిల్లాపరిషత్ పాఠశాల విద్యార్థినీ విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ, క్విజ్ పోటీలను నిర్వహించింది. ఈ పోటీలలో గెలుపొందిన విద్యార్థినీ విద్యార్థులకు బహుమతులను దేవస్థానం మంగళవారం అందజేసింది. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కార్యనిర్వహణాధికారిణి ఆర్. రమణమ్మ మాట్లాడుతూ విద్యార్థులకు వ్యాసరచన, వక్తత్వ, క్విజ్ పోటీలను నిర్వహించడం వలన రచనపట్ల అవగాహన కలుగుతుందని, విషయజ్ఞానం కలుగుతుందని, పోటీతత్త్వం పెరుగుతుందని అన్నారు. ప్రధానోపాధ్యాయులు కె. వెంకటరమణ మాట్లాడుతూ దేవస్థానంవారు పాఠశాల విద్యార్థినీ విద్యార్థులకు ఇలాంటి పోటీలు నిర్వహించడం హర్షించదగిన విషయం అని, విద్యార్థుల సర్వన్నోతికి ఇలాంటి కార్యక్రమాలు ఎంతగానో ఉపయోగపడుతాయన్నారు. కార్యక్రమంలో ప్రజాసంబంధాల అధికారి టి.శ్రీనివాసరావు, స్కూల్ మేనేజ్ మెంట్ కమిటి చైర్మన్ డి.వెంకటలక్ష్మి, వైస్ చైర్మన్ టి. వెంకటశివుడు, ఉపాధ్యాయుల బృందం పాల్గొన్నారు.

ఎస్‌టిబిసిలో బ్లడ్ డొనేషన్ క్యాంప్

ప్రజాశక్తి - కర్నూలు జిల్లాపరిషత్

కేంద్ర ప్రభుత్వ కార్యక్రమం అయిన స్వచ్ఛతాహి సేవలో భాగంగా కర్నూలు ఎస్‌టిబిసి డిగ్రీ కళాశాలలో మంగళవారం బ్లడ్ డొనేషన్ క్యాంప్ కరస్పాండెంట్ డాక్టర్ ఆర్ ఆర్ డి సజీవరాజు, ప్రిన్సిపల్ డాక్టర్ ఆర్. ప్రశాంతి శ్యామ్, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్లు శోభ మౌనిక, దన్యవతి అధ్వర్యంలోనిర్వహించారు. ఈ క్యాంప్‌లో అధ్యాపక బృందం, విద్యార్థులు పాల్గొని రక్త దానం చేశారు. ప్రిన్సిపల్ డాక్టర్ ఆర్.ప్రశాంతి శ్యామ్ మాట్లాడుతూ ఆరోగ్య వంతులు చేసేరక్త దానం ఆపదలో ఉన్న వారికి ఉపయోగ పడుతుందని అన్నారు. సేకరించిన రక్తాన్ని ప్రభుత్వ సర్వజన వైద్యశాలకు పంపించామని ఆమె తెలిపారు. ఎస్‌టిబిసి కళాశాల అధ్యాపక బృందం, ప్రభుత్వ సర్వజన వైద్యశాల నుంచి కిరణ్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

సిఎంను మర్యాదపూర్వకంగా కలిసిన ఎస్‌పి

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

పత్తికొండ మండలం, పుచ్చకాయల మాడ గ్రామంలో లబ్దిదారులకు ఎన్‌టిఆర్ భరోసా పింఛన్లు పంపిణి చేసే కార్యక్రమం సంధర్భంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మంగళవారం కర్నూలు జిల్లాకు వచ్చారు. సిఎంను జిల్లా ఎస్‌పి జి.బిందు మాధవ్ మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్చం అందజేశారు. ప్రజాప్రతినిధులు, డిఎస్‌పిలు వెంకట్రామయ్య, ఉపేంద్రబాబు, సిఐలు ఉన్నారు.

విద్యుత్ తీగలను సరిచేసిన అధికారులు

ప్రజాశక్తి వార్తకు స్పందన

ప్రజాశక్తి-మద్దికేర

ప్రమాదకరంగా కిందకు వేలాడుతున్న 11కె.వి విద్యుత్ తీగలను ట్రాన్స్‌కో ఎఇ మహమ్మద్ రఫీ ఖాన్, సిబ్బంది సోమవారం సరి చేశారు. యడవలి గ్రామ సమీపాన విద్యుత్ తీగలు వేలాడుతూ ప్రమాదకరంగా ఉన్న విషయాన్ని ప్రజాశక్తి వార్తగా ప్రచురించడంతో అధికారుల్లో చలనం వచ్చింది. కిందకి వేలాడుతున్న తీగలను సరి చేసేందుకు మధ్యలో విద్యుత్ స్తంభాన్ని ఏర్పాటు చేశారు. ప్రమాదకరంగా ఉన్న 11 కెవి విద్యుత్ తీగలను సరి చేయడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

ఘనంగా కర్నూలు వైభవం వేడుకలు

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

మొదటి భాషాప్రయుక్త రాష్ట్రానికి రాజధానిగా కర్నూలు 71 సంవత్సరాలు పూర్తిచేసుసుకున్న సందర్భంగా కర్నూలు వైభవం వేడుకలు మంగళవారం సిల్వర్ జూబ్లీ కళాశాలలో ఘనంగా నిర్వహించారు. క్లస్టర్ విశ్వవిద్యాలయం , కర్నూలు జిల్లా మేధావుల వేదిక సంయుక్త ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించింది. డాక్టర్ వి వి సుబ్రహ్మణ్య కుమార్ అధ్యక్షతోపన్యాసంలో ఆంధ్రరాష్ట్ర సాధనకు జరిగిన కృషిని తెలిపారు. ముఖ్య అతిథి ఆచార్య డివిఆర్.సాయి గోపాల్ కర్నూలు ప్రాంతం గొప్ప మేధావులను, స్వాతంత్ర్య సమరయోధులను, మహాదాతలను జాతికి అందించినదని కొనియాడారు. చరిత్రలో కుర్నూలుకు విశిష్ఠమైన స్థానం ఉన్నప్పటికీ అభివృద్ధి చెందకపోవడం బాధాకరమని పేర్కొన్నారు. విశిష్ఠ అతిథి క్లస్టర్ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ ఆచార్య కట్టా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఆంధ్రరాష్ట్ర అవతరణ తెలుగువారి తొలివిజయంగా పేర్కొన్నారు రాజధానిగా కర్నూలునగరం రాయలసీమ ప్రాంతీయుల మరో విజయంగా పేర్కొన్నారు. ప్రస్తుతం నాలుగు విశ్వవిద్యాలయాలతో ఈ నగరం ఎడ్యుకేషనల్ హబ్‌గా అభివృద్ధి చెంది మరో మెట్టు ఎదిగినదని పేర్కొన్నారు. కర్నూలు జిల్లా మేధావుల వేదిక వ్యవస్థాపకులు ఆచార్య మన్సూర్ రెహ్మాన్ మాట్లాడుతూ కర్నూలు నగర పరిణామ క్రమాన్ని అంటే కందెనవోలు గ్రామం ఒక మహా నగరంగా అభివృద్ధి చెందిన తీరును వివరించారు. ఉస్మానియా కళాశాలను సందర్శించిన సందర్భంగా ప్రధాని జవహర్ లాల్ నెహ్రూ కర్నూలు నగరం పాత ఢిల్లీని తలపిస్తుందని వ్యాఖ్యానించడం గమనిస్తే ఉత్తర దక్షణ భారతదేశ సంస్కృతుల సమ్మేళనంగా ఈ నగరం అభివృద్ధి చెందినది తెలుస్తున్నదన్నారు. గాడిచర్ల ఫౌండేషన్ అధ్యక్షులు చంద్ర శేఖర కల్కూర మాట్లాడుతూ కర్నూలు నగరం అన్ని రంగాలలో అంటే రాజకీయ, ఆర్థిక, సామాజిక ,ఆధ్యాత్మికంగా ఒక చక్కటి సంస్కృతిని జీవనశైలిని కలిగి ఉందని తెలిపారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల విశిష్టతలను, అపురూపమైన కట్టడాలను, అరుదైన ఉత్పత్తులను తెలియజేసారు. కళాశాల ఉపాధ్యక్షులు డాక్టర్ బి ఆర్ ప్రసాద్‌రెడ్డి బిఆర్ ప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ ప్రజలు తాము నివసిస్తున్న ప్రదేశాలతో చక్కని అనుబంధం కలిగి ఉంటారని, ప్రతి ప్రదేశానికి ఒక ప్రత్యేకత ఉంటుందని పేర్కొన్నారు. కార్యక్రమ సమన్వయకర్త డాక్టర్ అఖ్తర్ బాను మాట్లాడుతూ కర్నూలు నగరం వివిధ రంగాలలో సాధించిన ప్రగతి మిగతా ప్రాంతాలకు మార్గదర్శకమని, మనమందరం మాతృమూర్తిని, జన్మభూమిని మాతృభాషను జీవితాంతం గౌరవించాలన్నారు. ఈ వేడుకలలో కర్నూలు వైభవంపై నిర్వహించిన కవితా రచన పోటీ విజేతలకు జ్ఞాపికలను, ప్రశంసాపత్రాలను అందజేశారు. ఆచార్య సాయిగోపాల్ 'కర్నూలు వైభవం' కరదీపికను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు , విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు. జాతీయ గీత ఆలాపనతో కర్నూలు నగర వైభవం వేడుకలు ముగిశాయి.

కర్నూలు వైభవం కరదీపికను ఆవిష్కరిస్తున్న విసి సాయిగోపాల్, సుబ్రమణ్యకుమార్, మన్సూర్‌రెహ్మాన్, అక్తర్ బాను

రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీలకు 'నారాయణ' విద్యార్థులు ఎంపిక

ప్రజాశక్తి - కర్నూలు జిల్లా పరిషత్

కర్నూలు నగరం బుధవార పేట నారాయణ స్కూల్ విద్యార్థులు నంద్యాల పట్టణంలోని పద్మావతి నగర్‌లోని డిఎస్ఎ ఇండోర్ స్టేడియంలో సెప్టెంబర్ 30న జరిగిన తైక్వాండో జిల్లా స్థాయి స్కూల్ గేమ్స్ పోటీల్లో ప్రతిభ చూపి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. మంగళవారం స్థానిక నారాయణ పాఠశాలలో రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులకు అభినందన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా నారాయణ విద్యాసంస్థల ఏజీఎం ఎస్.రమేష్ కుమార్ హాజరై రాష్ట్ర పోటీలకు ఎంపికైన క్రీడాకారులు బి.లైఖ్యశ్రీ చందన, జి.కార్తీకలను అభినందించారు. అనంతరం ప్రిన్సిపల్ ఎం. శ్రీనివాసులు రెడ్డి మాట్లాడుతూ జిల్లా స్థాయి పోటీల్లో అండర్-17 బాలికల విభాగంలో బి.లైఖ్యశ్రీచందన, జి.కార్తీకలు బంగారు పతకం సాధించారని తెలిపారు. అండర్-14లో జి.మహమ్మద్ అద్నాన్ తృతీయ స్థానం, అండర్-17లో మనోజ్ కుమార్ ద్వితీయ స్థానంలో నిలిచారని చెప్పారు. తైక్వాండో కోచ్ జి.షబ్బీర్ హుస్సేన్ మాట్లాడుతూ ఈ నెల 6 నుండి 8 వరకు తిరుపతిలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో బి.లైఖ్యశ్రీ చందన, జి.కార్తీకలు పాల్గొంటారని తెలిపారు. ఎఒ తిమ్మారెడ్డి, పాఠశాల ఉపాధ్యాయ బృందం, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయికి ఎంపికయిన క్రీడాకారులను అభినందిస్తున్న అధితులు

మార్కెట్ లో పర్యటించిన కార్యదర్శి ఆర్.జయలక్ష్మి

ప్రజాశక్తి-కర్నూలు అగ్రికల్చర్

కర్నూలు వ్యవసాయ మార్కెట్‌లో ఉల్లి దిగుబడులు అత్యధికంగా రావడంతో రైతులకు సమస్యలు లేకుండా తూకాల్లో మోసాలు జరగకుండా ఉండేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఎంపిక శ్రేణి కార్యదర్శి ఆర్.జయలక్ష్మి అన్నారు. మంగళవారం మార్కెట్ అంతటా ఆమె పర్యటించారు. ఉల్లి రైతులతో పాటు మిగతా పంట దిగుబడులు తెచ్చిన రైతులతో సమస్యలు అడిగి తెలుసుకున్నారు. రైతుల సమస్యలు ఏదైనా ఉంటే కార్యాలయంలో ఫిర్యాదు చేయాలని రైతులకు తెలిపారు. అధికారులు, సిబ్బంది రైతులకు ఎలాంటి సమస్యలు లేకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. అసిస్టెంట్ కార్యదర్శి వెంకటేశ్వర్లు, రెహమాన్, సూపర్ వైజర్లు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎసిఎల్ సాంబశివ

ఉమ్మడి కుటుంబాలు కనుమరుగు

తల్లిదండ్రులు పట్ల పిల్లలు బాధ్యతగా వ్యవహరించాలి

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

సమాజంలో ఉమ్మడి కుటుంబంలో కలతలు పెరిగి కనుమరుగవుతున్నాయని కార్మిక శాఖ అసిస్టెంట్ లేబర్ కమిషనర్ సాంబశివ తెలిపారు. మంగళవారం కర్నూలు నగరంలోని 48వ వార్డు రోజా వీధిలో అంతర్జాతీయ వృద్ధుల దినోత్సవం సందర్భంగా వృద్ధులకు 2007 తల్లిదండ్రులు వయోవృద్ధుల రక్షణ పోషణ చట్టం పై అవగాహన కార్యక్రమం ఎస్‌సి, ఎస్‌టి, బిసి,.మైనార్టీ హక్కుల వేదిక నాయకురాలు మీసాల సుమలత ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా కార్మిక శాఖ అసిస్టెంట్ లేబర్ కమిషనర్ సాంబశివ మాట్లాడుతూ 2007 తల్లిదండ్రులు వయోవృద్ధుల రక్షణ పోషణ చట్టం కేంద్ర ప్రభుత్వం తీసుకు వచ్చిందని, 2011 నియమావళితో వయోవృద్ధుల ధన, ప్రాణాలకు రక్షణ కల్పించేందుకు సమూల మార్పులు తీసుకు రావలసిన అవసరం ఎంతైనా ఉందన్నారు. సమాజంలోని ప్రతి ఒక్కరూ నేర్పుతో పెద్ద మనసుతో మసులుకోవలసిన అవసరం ఎంతైనా ఉందన్నారు. పిల్లలు తమ ఉన్నతికి కారకులైన తల్లిదండ్రుల పట్ల బిడ్డలు బాధ్యతగా వ్యవహరించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆంజనేయులు, నాగప్ప, నాగన్న ,శాలుమియా, చమ్మ నారాయణమ్మ, కర్రమ్మ, శేషమ్మ పాల్గొన్నారు.